

రాపూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

సేవ్ రాపూరు, కలువాయి!

- తిరుపతి వద్దు.. నెల్లూరులోనే ఉంటాం
- రెండు ప్రాంతాల్లోనూ నిరసన ర్యాలీలు

రాపూరు/కలువాయి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : 'సేవ్ రాపూరు, కలువాయి... తిరుపతి వద్దు.. నెల్లూరే ముద్దు' అంటూ రాపూరు, కలువాయిలలో గురువారం నిరసన ర్యాలీలు జరిగాయి. రాపూరులో ఉదయం పట్టణవాసులంతా ఏకమై సిద్ధలేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నిరసన ర్యాలీ ప్రారంభించారు. పడమటి వీధి, పాత బస్టాండ్ మీదుగా బాలాజీ కాంప్లెక్స్ వద్దకు చేరుకుని మానవహారం నిర్మించారు. సేవ్ రాపూరు - సేవ్ నెల్లూరు, తిరుపతి వద్దు నెల్లూరు ముద్దు నినాదాల హోరుతో రాపూరు దద్దరిల్లింది. అనంతరం తహసీల్దారు లక్ష్మీనరసింహంకు వినతిపత్రం అందజేశారు. కాగా, వ్యాపారులంతా దుకాణాలు మూసి స్వచ్ఛందంగా ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, యువత, జేఏసీ నాయకులు భారీగా పాల్గొన్నారు.

- పోరాడుదాం.. సాధించుకుందాం!


కలువాయిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

'ఉద్యోగ, ఉపాధ్యాయ, వ్యాపార సంఘాలతో కలిసి అందరం ఐక్యంగా పోరాడుదాం. మన కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే ఉండేలా సాధించుకుందాం.' అని టీడీపీ మండల కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. గురువారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా రఘురామిరెడ్డి అధ్యక్షతన నాయకులంతా సమావేశమయ్యారు. కలువాయిని గూడూరు రెవెన్యూ డివిజన్, తిరుపతి జిల్లాలోకి తీసుకెళుతూ మంత్రివర్గ ఉపసంఘం చేసిన నిర్ణయంపై చర్చించారు. అయితే, దీనిని నాయకులంతా ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ఇదే

- మిగతా 6వ పేజీలో..

పోలీసు స్టేషన్‌లపై ఫోకస్

- దృష్టి పెట్టిన ఎస్పీ అజిత
- ఐడీ పార్టీల జాబితా సేకరణ
- అధికారులు, సిబ్బందిలో వణుకు
- సీసీఎస్, ఎస్‌బీలో పాతుకుపోయిన ఖాకీలు

8లో..

బడిలో వేడుకకు రారండోయ్..!

- నేడు మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ (పీటీఎం)

ఆత్మకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్ మీటింగ్ జరగనుంది. ఈ మేరకు ఆయా విద్యాసంస్థలు ముస్తాబయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటికే రెండుసార్లు పీటీఎం విజయవంతంగా నిర్వహించింది. గత ఏడాది తల్లిదండ్రులకు ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈసారి అలాంటివి పక్కన పెట్టి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి ప్రభుత్వ పాఠశాలల పురోగతి, నెలకొన్న సమస్యలు, పిల్లల చదువు, వారి నడవడిక, ప్రగతిపై చర్చించనున్నారు. ఈ సమావేశాల నిర్వహణకుగాను రాష్ట్ర ప్రభుత్వం రూ.52.43 లక్షలు విడుదల చేసింది. ఈ సమావేశాలకు అందరూ హాజరయ్యేలా ప్రత్యేక దృష్టి సారించి ఉపాధ్యాయులు ఆహ్వానాలు పంపారు. స్థానిక ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు కావాల్సి ఉంది. అందుకే ఉపాధ్యాయులు స్వయంగా ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులకు మెగా పీటీఎంకు తప్పక రారండోయ్.. అంటూ ఆహ్వాన పత్రాలు అందజేశారు. దూర ప్రాంతాల్లో ఉన్న తల్లిదండ్రులకు పోస్టు ద్వారా ఆహ్వాన పత్రాలు పంపారు.

హౌసింగ్ అధికారుల మెడకు ఉచ్చు

- గతంలో అక్రమాలు చేసినట్లు నిర్ధారణ
- రూ.కోట్లు పక్కదారి పట్టించారని అభియోగం
- 13 మందిపై చార్జ్‌స్ ఫ్రేమ్ చేసిన ప్రభుత్వం
- పది రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం

8లో..

డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.లక్షలు దోచేశారు!

నెల్లూరు (క్రైం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సీబీఐ అధికారుల మంటూ ఓ వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ చేసి రూ.66.50 లక్షలు దోచేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు నెల్లూరులోని నవాబుపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నవాబుపేట నాగేంద్రనగర్‌లో ఉంటున్న శ్రీనివాసులుకు శివప్రసాద్ అనే వ్యక్తి అక్టోబరులో ఫోన్‌చేసి 'మీపై బెంగళూరులో ఉమెన్ ట్రాఫికింగ్ కేసు నమోదయ్యింది. అరెస్ట్ వారెంట్ కూడా జారీ అయ్యింది.' అంటూ భయపెట్టాడు. సీబీఐ అధికారులతో మాట్లాడుతున్నట్లు వీడియోకాల్ చూపించారు. మరుసటి రోజు మరో వ్యక్తి ఫోన్ చేసి తాను సీబీఐ అధికారినని చెబుతూ ముంబై కెనరా బ్యాంకులోని మీ ఖాతాలో రూ.30 లక్షలు జమైందని దీనిపై కేసు నమోదైందని చెప్పాడు. ఈ కేసు నుంచి తప్పించాలంటే రూ.66.50 లక్షలు తాము చెప్పిన బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేయాలని చెప్పారు. దీంతో శ్రీనివాసులు పలు దఫాలుగా నగదు వారు చెప్పిన ఖాతాలకు పంపాడు. చివరకు తాను మోసపోయానని గ్రహించి బాధితుడు గురువారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యాబోధనకు ఇన్‌స్ట్రక్టర్స్

- ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు...
- ఐదు నెలల కాలానికి నియామకాలు
- జిల్లాలో 70 పోస్టుల భర్తీ

సబ్జెక్ట్ టీచర్లు లేని పాఠశాలల్లో విద్యావలంటీర్లతో బోధన చేయించనున్నారు. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉండటంతో బోధన కుంటుపడుతోంది. ఈ నేపథ్యంలో తొలుత విద్యార్థుల సంఖ్య ఆధారంగా మిగులు టీచర్లను గుర్తించి ఆయా పాఠశాలలకు పంపాలని ఆలోచించారు. అయితే దీనివల్ల రాజకీయ ఒత్తిళ్లు అధికమవుతాయని ఈ నిర్ణయాన్ని మార్చుకుని సబ్జెక్ట్ టీచర్లు కొరత ఉన్న చోట అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్ పేరుతో వలంటీర్లను నియమించాలని కమిషన్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లాలో 70 పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు.

8లో..

మున్సిపల్ స్థలానికి ఎసరు!

- కావలిలో రూ.10 కోట్లు విలువైన జాగాపై పెద్దల కన్ను
- అధికారులను బురిడీ కొట్టించే యత్నం
- ఓ తహసీల్దారు సంతకంతో నకిలీ పట్టాల సృష్టి

8లో..


నెల్లూరు నగరంలో గురువారం మధ్యాహ్నం మబ్బులు కమ్మేసి భారీ వర్షం కురవడంతో నగర వాసుల అవస్థలు

జలవలయం

గురువారం మధ్యాహ్నం 12 గంటలు. చూస్తుండగానే క్షణాల్లో వాతావరణం మారిపోయింది. నల్లటి మేఘాలు కమ్ముకున్నాయి. నిమిషాల వ్యవధిలోనే పగలు రేయిగా మారిపోయింది. చిమ్మ చీకటి నెల్లూరును కమ్మేసింది. విద్యుత్ దీపాల వెలుగులో నగరం రాత్రిని తలపించింది. ఆ తర్వాత కొద్దిసేపటికే కమ్ముకున్న మబ్బులు క్షణాల్లో కరిగి నీరయ్యాయి. సుమారు రెండు గంటల సేపు కుండపోత వర్షం కురిసింది. చిమ్మచీకటిలో ఆకాశాన్ని చీల్చుకుని నేలతాకిన చినుకులు చూస్తుండగానే పట్టణాలు, పల్లెల్లో రహదారులను వాగులుగా మార్చేశాయి. ఏ రోడ్డుపై చూసినా మోకాలి లోతున నీరు పరవళ్లు తొక్కాయి. నగరం, పట్టణాల పరిధిలోని అండర్ బ్రిడ్జీలు వరద నీటితో మడుగులు కట్టాయి. రోడ్డుపై వెళ్లే వాహనాలనూ ముంచేశాయి. నెల్లూరు నగరంలో ఆత్మకూరు బస్టాండ్, విజయమహల్ గేటు, రామలింగాపురం, మాగుంట లేవుట్ అండర్ బ్రిడ్జీల్లో నడుము లోతు నీరు చేరాయి. మాగుంట లే అవుట్ అండర్ బ్రిడ్జి వద్ద ఓ కారు పూర్తిగా నీట మునిగింది. అండర్ బ్రిడ్జీలు ఉన్న అన్ని ప్రాంతాల్లోనూ వాహన రాకపోకలు స్తంభించాయి.

- పగలు రేయి అయ్యింది.. లోతట్టు నీట మునిగింది!
- దిత్వా ప్రభావంతో వాతావరణంలో వింత మార్పులు
- నెల్లూరు నగరాన్ని కమ్మేసిన కరిమబ్బులు
- ఎడతెరిపి లేని వర్షం.. ఆపై పొగమంచు
- పోటెత్తిన వాగులు.. పొంగిన కలుజులు
- నీట మునిగిన కాలనీలు
- పొట్టేపాళెం కలుజులో పడి యువకుడి మృతి
- నెల్లూరు కాలువలో మరొకరి గల్లంతు
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

- నెల్లూరు రూరల్ మండలం అంబాపురం వద్ద కాలువగట్టు తెగి ఉడుముల వాగు మీద పడింది. వాగు కట్ట తెగి 1500 ఇళ్లను నీట ముంచింది. మొగళ్లపాలెం చెరువుకు గండి పడింది. కనుపూరు కాలువ ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. నగర శివారు ప్రాంతలన్నీ దాదాపుగా జలమయం అయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరింది. నగరంలో 17 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- అల్లూరు మండలంలో పైడేరు ఉధృతి కారణంగా రక్షణ గోడ తెగిపోయింది. పంట పొలాల్లోకి భారీగా వరద వచ్చి చేరుతోంది.
- ముత్తుకూరు మండలంలో గాదెల వాగు, బండ్లపాలెం గ్రామాల్లో ఇళ్ల నీట మునిగాయి. నక్కల కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది.
- మనుబోలును వరద వీడనంటోంది. పొలాలన్నీ నీటిలో ఉంటున్నాయి. సంగమేశ్వరాలయాన్ని నీరు చుట్టేసింది.
- సైదాపురం మండలం కైవల్యానది ఉధృతంగా ప్రవహించడంతో గూడూరు-రాజంపేట మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పిళ్ళేరు, ఊటుకూరు సమీపంలోని మాలేరు ఉధృతంగా ప్రవహించడంతో సైదాపురం- పొదలకూరు మధ్య రాకపోకలు స్తంభించాయి.
- ముత్తుకూరు మండలం బండ్లపాలెం జైభీమ్ కాలనీ నీట మునిగింది. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎక్కడికక్కడ వాగులు, వంకలు ఉధృతంగా పొంగి పొర్లుతున్నాయి.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

సోమశిలకు పెరిగిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద పెరుగుతోంది. బుధవారం 14 వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా గురువారం ఉదయానికి 22,186 క్యూసెక్కులకు పెరిగింది. రాత్రికి 30,455 క్యూసెక్కులకు పెరిగింది. ప్రస్తుతం జలాశయంలో 72.907 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 200, డెల్టాకు 2,650, కండలేరుకు 2వేల క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

మునిగిన ఆశలు

నెల్లూరు(వ్యవసాయం) : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తోడు పొంగిపొర్లుతున్న చెరువులు, కాలువలతో జిల్లావ్యాప్తంగా 3011 హెక్టార్లలో వివిధ పంటలు నీట మునిగాయి. ఈ మేరకు గురువారం సాయంత్రానికి వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. దాదాపుగా 1782 హెక్టార్లలో వరినారు, 2778 హెక్టార్లలో వరినాట్లు జలమయమయ్యాయి. ఆత్మకూరులో 68 హెక్టార్లలో మొక్కజొన్న, 28 హెక్టార్లలో శనగ పంటలు దెబ్బతిన్నాయి. పొదలకూరులో 65 హెక్టార్లలో శనగ, రాపూరులో 40 హెక్టార్లలో మినుము, చేజర్లలో 32 హెక్టార్లలో మినుము పంటలు నీట మునిగా యి. అత్యధికంగా మనుబోలు మండలంలో 713 హెక్టార్లలో వరి పైరు నీటమునకకు గురైంది. కావలిలో 360 హెక్టార్లు, వెంకటాచలం లో 279 హెక్టార్లు, బుచ్చిరెడ్డిపాళెం లో 220 హెక్టార్లు, నెల్లూరు రూరల్ లో 200 హెక్టార్లు, కోవూరులో 126 హెక్టార్లు, అల్లూరులో 124 హెక్టా ర్లు, రాపూరులో 80 హెక్టార్లు, పొద లకూరులో 54 హెక్టార్లు, సంగంలో 30 హెక్టార్లు, సైదాపురంలో 5 హెక్టార్ల వరిపైరు నీట మునిగింది. అత్యధికంగా చేజర్ల మండలంలో 733 హెక్టార్లలో వరినారు నీటమునిగింది. వెంకటాచలంలో 315, మనుబోలులో 175, బుచ్చిలో 105, నెల్లూరు రూరల్ లో 100 హెక్టార్లతోపాటు విడవలూరు, సైదాపురం, బోగోలు, కొడవలూరు, కావలి, కోవూరు, పొదల కూరు, అల్లూరు, సంగం, రాపూరు. తదితర మండలాల్లో 1782 హె క్టార్లలో వరినారు జలమయమైంది. మొత్తంగా 16 మండలాల్లో 143 గ్రామాల్లోని 6,321 మంది రైతులకు చెందిన 3011 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి.

- 85.6 హెక్టార్లలో ఉద్యాన పంటలు

దాదాపుగా 85.6 హెక్టార్లలో కూరగాయలు, ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యాన శాఖ అధికారుల ప్రాథమిక అంచనా. సైదాపురం, మనుబోలు, పొదలకూరు, ఏఎస్ పేట, చేజర్ల, కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట, ముత్తుకూరు, కలువాయి, మండలాల్లోని 20 గ్రామాల్లో మిరప, బొప్పాయి, పూలమొక్కలు, తమలపాకులు, వివిధ రకాల కూరగాయలు దెబ్బతిన్నాయి. మొత్తంగా 155 మంది రైతులకు దాదాపుగా రూ.30.6 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.


కలువాయి ప్రాంతంలో చెరువును తలపిస్తున్న వరి పొలాలు

మండలాలు : 16	గ్రామాలు 143	బాధిత రైతులు : 6,321 మంది	వరినారు : 1,782 హెక్టార్లు	వరినాట్లు : 2,778 హెక్టార్లు	ఉద్యాన పంటలు : 85.6 హెక్టార్లు


కోవూరు శాంతినగర్‌లో..


మనుబోలు : ట్రాక్టర్‌లో తీరప్రాంతానికి వెళుతున్న అధికారులు


మనుబోలు : ముంపువాసుల కోసం పడవ సిద్ధం


చేజర్లలో చెరువును తలపిస్తున్న నారుమడులు


చేజర్ల : టీకే పాడు సమీపంలో నల్లవాగు ఉధృతి


ఆత్మకూరులో దెబ్బతిన్న వరినారును చూపుతున్న రైతులు

కలవరపెడుతున్న కండలేరు

కండలేరు ప్రాజెక్టు వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే జలాశయం పూర్తిసామర్థ్యంతో నిండిపోగా ప్రాజెక్టులోకి వరద నీరు పోటెత్తి చేరుతోంది. డ్యాంలోకి 30 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో తొలిసారిగా స్పిల్‌వే గేట్లు ఎత్తేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అయితే ఈ గేట్లు ఎత్తడం అనివార్యమయితే సైదాపురం, పొదలకూరు, మనుబ లు మండలాల పరిధిలో కనుపూరు చెరువు పరివాహక ప్రాంతాల పరిధిలోని గ్రామాలు నీట మునిగే ప్రమాదం ఉంది. అంతేగాక వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగే ప్రమాదం ఉందని ప్రజలు హడలిపోతున్నారు. విపత్కర పరిస్థితులు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం కోసం కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రాజెక్టును సందర్శించి ఇంజనీరిం గ్ అధికారులకు తగు సూచనలు చేశారు. ఇప్పటికే కండలేరు వాగు పరివాహక ప్రాంతాల గ్రామస్థులను అప్రమత్తం చేశారు.

- స్పిల్ వేలో ఓ గేటు ఎత్తి..

పొదలకూరు : గురువారం రాత్రి కండలేరు డ్యాంలోని స్పిల్ వేలో ఓ గేటు ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. అంతకముందు డ్యాం వద్దకు చేరుకున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఆర్డీవో నాగ అనూషా, సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గేట్లను పరిశీలించారు. గేట్లు ఎత్తే సమయంలో జనరేటర్ మొరాయించడంతో జనరేటర్‌ను తెప్పించి, గేటు ఎత్తి నీటిని వదిలారు.


కండలేరు అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా


సైదాపురం : తురిమెర్ల వద్ద పిళ్ళేరువాగు ఉగ్రరూపం


నెల్లూరు రూరల్ : పొట్టేపాళెంలో యువకుడి మృతదేహాన్ని తీసుకొస్తున్న స్థానికులు

ఒకరి మృతి..

- మరొకరి గల్లంతు

ఉధృతంగా ప్రవహించిన వరద నీటిలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరు గల్లంతయ్యారు. నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెం కలుజు వద్ద 17 ఏళ్ల షేక్ మెహరాజ్ వరదలో పడి మృతి చెందాడు. మూర్ఛవ్యాధిగ్రస్తుడైన ఈ యువకుడు కలుజు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరదను చూసి మూర్ఛకు గురై నీటిలో పడి మరణించాడు. అలాగే, నెల్లూరు కాలువలో పడి 55 ఏళ్ల రవి గల్లంతు అయ్యాడు.

- మూడు పశువులు..

భారీవర్షాలకు జిల్లాలో మూడు పశువులు మృతిచెందినట్లు పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపారు. కోవూరు మండలం మోడేగుంటలో ఒక ఆవు, ఇందుకూరుపేటలో ఇక దూడ, నర్రవాడలో ఒక గేదె మృతిచెందాయి. వీటి విలువ దాదాపుగా రూ.1.25 లక్షలుగా లెక్కగట్టారు.


నెల్లూరు : నీటమునిగిన వైఎస్సార్ నగర్

రోడ్డు నిర్మాణానికి నేతల యత్నం : అడ్డుకున్న పోలీసులు

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దామరమడుగు హైస్కూలు ప్రాంతంలో వున్న అర్ అండ్ బీ రోడ్డు ప్రాంతంలో పలువురు స్థానిక నాయకులు గురువారం సిమెంటు రోడ్డు నిర్మాణం పనులు చేపట్టే ప్రయత్నం చేశారు. దీంతో కొంతమంది స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అర్‌అండ్‌బీ ఏఈ నాగరాజు బుచ్చి పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సంతోష్‌రెడ్డి, ఎఎస్ఐలు, సిబ్బందితో వెళ్లి రోడ్డు పనులను అడ్డుకున్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12238
వెండి కిలో ధర	రూ. 179800
వెండి ఒక గ్రాము	రూ. 184.40

‘దిత్వా’తో జనజీవనం అస్తవ్యస్తం

• పొంగిన వాగులు, వంకలు • నీట మునిగిన వరినారుమడులు, నాట్లు • లోతట్టు ప్రాంతాలు, కాలనీల జలమయం • తిరులమ్మపాళెంను చుట్టుముట్టిన వరద • జలదిగ్బంధంలో ముదిగేడు • కలెక్టర్ కండలేరు సందర్శన • రైతులకు ప్రజాప్రతినిధుల పరామర్శ • నిత్యావసరాల పంపిణీ • పరిహారం ఇప్పిస్తామని ఎమ్మెల్యే సోమరెడ్డి హామీ



వెంకటాచలం : ముంపునకు గురైన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి



పొదలకూరు : ట్రాక్టర్ ద్వారా రాకపోకలు సాగిస్తున్న ముదిగేడు వాసులు



కోవూరు : వరదనీటిలో చేపలు పడుతున్న జాలర్లు

పొదలకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ కారణంగా మండలంలోని ముదిగేడు - ఇనుకుర్తి గ్రామాల మధ్య ఉన్న వాగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో ముదిగేడు నుంచి పొదలకూరు - రాపూరు మెయిన్ రోడ్డుకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆ గ్రామస్థులకు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయినట్లయింది. ముదిగేడు నుంచి మెయిన్ రోడ్డుపైకి వస్తేనే వారు ఎక్కడికైనా వెళ్లే అవకాశం ఉంది. వాగు దాటనివ్వకపోవడంతో ఆ గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పనులపై వెళ్లాల్సిన వారిని ట్రాక్టర్ ద్వారా వాగు దాటిస్తున్నారు.

• అప్రమత్తంగా ఉండాలి : సోమిరెడ్డి

కండలేరు జలాశయానికి భారీగా వరద ప్రవాహం చేరుతుందని, కండలేరు స్పిల్‌వే పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. వరద పరిస్థితిపై ఎప్పటికప్పుడు తెలుగుగంగ అధికారులతోపాటు కలెక్టర్ హిమాన్షు శుక్లా, తహసీల్దార్లతో ఆయన గురువారం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కండలేరు నుంచి ప్రస్తుతం వదులుతున్న వెయ్యి క్యూసెక్కుల ప్రవాహంతోనే మనుబోలు మండలంలోని తూర్పు గ్రామాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. డ్యాం స్పిల్ వే నుంచి నీటిని విడుదల చేస్తే ఆ జలాలతో మనుబోలు మండలం మరింత ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు.

• ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సీఐ

భారీ వర్షాలు కురుస్తున్నందున మండలంలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ శివరామ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఇళ్ల వద్ద నుంచి బయటకు రావద్దని కోరారు.

• నీట మునిగిన వరినాట్లు

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేని వర్షాలకు మండలంలోని వరినాట్లు, నారుమళ్లు నీట నీట మునిగాయి. మంగళవారానికే కొంతమేర దెబ్బతిన్న వరినాట్లు బుధ, గురువారాల్లో కురిసిన కుండపోత వర్షానికి వరినాట్లు పూర్తిగా నీట మునిగాయి. ఈ పరిస్థితిలో వరినాట్లు వేసిన రైతులను వర్షం ఆందోళనలో పడేసింది. ఇప్పటికైనా వర్షం ఆగితే దెబ్బతిన్న వరకు పోయినా కొంతైనా దక్కుతుందని అన్నదాతలు అంటున్నారు. కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు నారుమళ్లు రోజుల తరబడి నీట మునగడంతో లేత నారు పాచిపోతుంది. నారుమళ్లలో చేరిన నీటిని తొలగించే ప్రయత్నాలు చేసినా ఆగకుండా కురుస్తున్న వర్షాలతో నారుమళ్లు ఇప్పటికే కొంతమేర దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇంతటితోనైనా వర్షాలు ఆగకుంటే ఉన్న నారుమళ్లు కూడా దెబ్బతింటాయని రైతులు వాపోతున్నారు.

• రైతుల కష్టనష్టాలు ప్రభుత్వం దృష్టికి... : సోమిరెడ్డి

వెంకటాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతుల కష్టానష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని తాటిపర్తిపాళెం, ఎగువమిట్ట, పూడిపర్తి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు. పేదల కోసం టీడీపీ నేతలు సమకూర్చిన బియ్యం, కూరగాయలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ నష్టపోయిన రైతులందరికీ సబ్సిడీపై విత్తనాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొమ్మి సురేంద్ర, రావూరి రాధాకృష్ణమనాయుడు, కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, చల్లా నాగార్జున్‌రెడ్డి, ఈపూరు సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, నిక్కుదల రమేష్, ముక్కు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

• ముత్తుకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. జోరువానలో ఆయన గురువారం నీట మునిగిన గాదెల వాగు, నారికేళపల్లి, బండ్లపాలెం దళిత వాడలు గిరిజన కాలనీల్లో పర్యటించి, బాధితులను పరామర్శించారు. నీట మునిగిన ఇళ్లను, పొలాలను పరిశీలించారు. గిరిజనులకు బియ్యం, పప్పుదినుసులను, దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ నాయకులు బొమ్మి సురేంద్ర, రాధాకృష్ణమనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు రాగల శివకృష్ణ, నాయకులు పల్లికొండ శీనయ్య, పబ్బారెడ్డి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• కోవూరు అతలాకుతలం

కోవూరు, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): కురుస్తున్న భారీ వర్షాలకు గురువారం మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజా జీవనం అతలాకుతలమైంది. ఉదయం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. శాంతి నగర్‌లో వీధుల్లో వర్షపునీరు నిలిచాయి. నారుమళ్లల్లో నీరు నిలిచాయి. కోవూరు, పాటూరు, గంగవరం గ్రామాల్లోని పొలాల్లో వర్షపు నీరు నిలవడంతో చెరువుల్ని తలపించాయి. కోవూరు చెరువుకట్ట, కలుజు ప్రాంతాన్ని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఇంతా మల్లారెడ్డి నాయకత్వంలో టీడీపీ నాయకులు, గండవరపు శేషయ్య నాయకత్వంలో సీపీఎం నాయకులు వేర్వేరుగా పరిశీలించారు. భారీ వర్షానికి స్థానికులు ఇళ్లకే పరిమితమయ్యారు. కుండపోతగా వర్షం కురుస్తున్నా జలపుష్ప ప్రియులు గుమ్మళ్లదిబ్బ సమీపంలోని కాలువ వద్దకు చేరుకున్నారు.భారీ వర్షాలకు కోవూరు చెరువు నుంచి పెద్ద పెద్ద చేపలు కాలువలోకి వస్తుండటంతో పలువురు జాలర్లు పగ్గాలకు పనిపెట్టారు.

• వీడని వర్షంతో రైతుల ఆందోళన

మనుబోలు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా గురువారం వర్షం కురియడంతో చెరువులకు, వాగులకు ప్రవాహం ఎక్కువైంది. మనుబోలు పెద్దచెరువు కలుజు చెక్కలను రైతులు ఎత్తేశారు. అలాగే మనుబోలు, గొట్లపాళెం, వెంకన్నపాళెం రహదారులపై ఇంకా కండలేరు, పొట్టేళ్ల వాగు, వరదనీరు పారుతుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. డీపీవో వసుమతి, ఇరిగేషన్, మత్స్యశాఖ, ఇతరశాఖల అధికారులు గ్రామాల్లో పర్యటించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మరో పక్క కలెక్టర్‌కు సమస్యలు చెప్పుకుందామని ఆయా గ్రామాల రైతులు ఎదురుచూశారు. తహసీల్దార్ రమాదేవి, ఎస్ఐ. శివరాకేష్‌లు తీర ప్రాంతాల్లో పర్యటించేందుకు రోడ్డు మార్గం మూసుకుపోవడంతో ట్రాక్టర్‌లో వెళ్లారు.

• వరినాట్లు మునక

తోటపల్లిగూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కురుస్తున్న వర్షానికి స్థానిక జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఈదూరు దళిత కాలనీలో పూరిగుడిసెల్లోకి నీరు చేరింది. కోడూరు, సాలిపేట, తోటపల్లి, వరిగొండ, గ్రామాల్లో వరినారు మళ్ల, వరి నాట్లు నీట మునిగాయి.

• ‘దిత్వా’తో సైదాపురం దిగ్బంధం

గూడూరు అర్బన్ (సైదాపురం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్‌తో సైదాపురం జలదిగ్బంధంలో చిక్కుకుంది. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు వరదపోటెత్తింది. దీంతో చుట్టున్న దారులన్నీ అధికారులు మూసివేశారు. తురిమెర్ల వద్ద పిన్నెరు ప్రవాహం అధికం కావడంతో గురువారం ఉదయం చప్టాకి ఇరువైపులా ముళ్లచెట్లు, ట్రాక్టర్ టక్కులతో రోడ్డు మూసివేశారు. ఇదే మార్గంలోని ఊటుకూరు వద్ద మాలేరు పరుగులు తీయడంతో అక్కడ రాకపోకలు నిలిపివేశారు. గిద్దలూరు వాగు ప్రవాహం ఎక్కువ కావడంతో అక్కడ నుంచి గూడూరు రోడ్డు మార్గాన్ని మూసివేశారు. కైవల్య ఉధృతం పొంగిప్రవహిస్తుండడంతో సైదాపురం నుంచి గూడూరుకు రాకపోకలు నిలిపోయాయి. అనంతమడుగు వద్ద కుంటికాలువ పరుగులు తీయడంతో సైదాపురం- వేములచేడు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. సైదాపురం పెద్దచెరువు కలుజు ప్రవాహం ఎక్కువ కావడంతో సైదాపురం- తూర్పుపూండ్ల మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలంలో దాదాపు అన్ని చెరువులు నిండుకుండలా మారాయి. . మండలంలో ఊటుకూరు, తురిమెర్ల, గిద్దలూరు, కమ్మారుపల్లి, కృష్ణారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో నారుమళ్లు నీట మునిగాయి. ఊటుకూరు, గిద్దలూరు బీసీకాలనీ, తూర్పుపూండ్ల బీసీకాలనీల్లో ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. సైదాపురం పోలేరమ్మగుడి వద్ద 20 కుటుంబాలు గిరిజనులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తహసీల్దారు సుభద్ర తెలిపారు.

• అవసరమైన చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

పొదలకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కండలేరు జలాశయం వద్ద నీటి ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం కండలేరు జలాశయాన్ని కలెక్టర్ పరిశీలించారు. డ్యాం కెపాసిటీ, క్రస్ట్ గేట్లు, మోటారు పనితీరు వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కండలేరులో 60 టీఎంసీలు నీరు ఉందని, ఎటువంటి ఇబ్బంది లేదని ఎస్ఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు కలెక్టర్‌కు వివరించారు. కండలేరు సమీప గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నెల్లూరు ఆర్డీవో అనూషకు సూచించారు. కలెక్టర్ వెంట ఎస్ఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆర్డీవో అనూష, పలువురు ఇంజనీరింగ్ అధికారులు, సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, తదితరులు ఉన్నారు.

• నీటి ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షించాలి

రాపూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కండలేరు జలాశయం వద్ద నీటి ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం కండలేరు జలాశయాన్ని కలెక్టర్ పరిశీలించారు. డ్యాం కెపాసిటీ, క్రస్ట్ గేట్లు, మోటారు పనితీరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.కలెక్టర్ వెంట ఎస్ఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆర్డీవో అనూష, పలువురు ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.



బుచ్చి : జొన్నవాడ మార్గంలో నీట మునిగిన వరినాట్లు



మనుబోలు : వెంకన్నపాళెం వద్ద ఆక్కా రైతుతో మాట్లాడుతున్న డీపీవో వసుమతి




గూడూరు రూరల్ : సైదాపురం వద్ద కైవల్యానది ఉధృతి

• కాలనీల జలమయం

ముత్తుకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కుండపోతగా కురిసిన వర్షం గురువారం ముత్తుకూరును ముంచెత్తింది. గ్రామాల్లో పొలాలు జలమయమై చెరువులను కనిపిస్తున్నాయి. పలుచోట్ల దళితవాడలో గిరిజన కాలనీలు నీట మునిగాయి. రోడ్లపై నీరు వెల్లువలా పారింది. తహసీల్దారు స్వప్న అధికారుల బృందాలు లోతట్టు ప్రాంత గ్రామాల్లో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. గురువారం సాయంత్రానికి దాదాపు 240మి.మీ వర్షపాతం నమోదైంది.

• తిరుమలమ్మపాళెంను చుట్టుముట్టిన నీరు

వెంకటాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుమలమ్మపాళెం గ్రామాన్ని కండలేరు జలాలు చుట్టుముట్టాయి. గ్రామానికి వచ్చే వంతెన మీద వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్థుల రాకపోకలతోపాటు సహాయక చర్యల కోసం అధికారులు బోటు ఏర్పాటు చేశారు. మండలంలోని లోతట్టు గ్రామాల్లోని పొలాలు సముద్రాన్ని తలపిస్తున్నాయి. గురువారం కూడా జోరువాన కురిసింది. ఇప్పటికే వందల ఎకరాల్లో రైతులు వేసుకున్న నారుమడులు, నాట్లు నీట మునిగాయి. వరద ఉధృతం కావడంతో చెముడుగుంట, వెంకటాచలం గ్రామాల వద్ద జాతీయ రహదారిపై నీరు కొంత మేరకు నిలిచి ఆ తర్వాత తగ్గింది. మండలంలోని దాదాపు అన్నీ చెరువులు నిండుకుండలా మారాయి. దీంతో ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది చెరువు తూము చెక్కలను ఎత్తివేసి వరద నీటిని కిందకు వదిలేశారు. గ్రామాల్లోని టీడీపీ నేతలు సహాయక చర్యలు చేపట్టారు.



చిన్న చెరుకూరులో..

ప్రతీ ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలి

కొడవలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు దేశభక్తి కలిగి ఉండాలని ఎస్‌వీ గ్రూపు అధినేత డాక్టర్ పీ.గుణశేఖర్ అన్నారు. మండలంలో కొడవలూరు పంచాయతీ పరిధిలో ఎస్‌వీ గ్రూపు ఆవరణలో నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్‌సీసీ) ఆధ్వర్యంలో గురువారం నేవల్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల, ఈవో గిరీష్, ఎన్‌సీసీ కేర్‌టేకర్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మయ్యకు ఎమ్మెల్యే పరామర్శ

మనుబోలు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి నూనె లక్ష్మయ్యను గురువారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల లక్ష్మయ్య తల్లి కిష్టమ్మ చనిపోయారు. దీంతో ఆమె ఉత్తర క్రియల్లో ఎమ్మెల్యే పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం మడమనూరు రైతులను ఎమ్మెల్యే పలకరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుంకుల నాగేంద్ర ప్రసాద్, బొమ్మి సురేంద్ర, సాని వెంకటరమణయ్య, ఉడతా విజయ్‌కుమార్, చెమిర్తి సుధీర్ పాల్గొన్నారు.

మెగా పీటీఎంకి ఆహ్వానం

మనుబోలు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల్లో శుక్రవారం జరగనున్న మెగా పీటీఎంకు హాజరుకావాలని జడ్పీటీసీ చిట్టమూరు అనితమ్మను ఉపాధ్యాయులు కోరారు. గురువారం హెచ్‌ఎం. అమూల్యకుమారి జడ్పీటీసీకి ఆహ్వాన పత్రికను అందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



బాధిత కుటుంబ సభ్యులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

విడవలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వివిధ అనారోగ్యాలతో బాధపడుతున్న బాధితులకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వీపీఆర్ నివాసంలో గురువారం అందజేశారు. మండలపరిధిలోని విడవలూరు, ఊటుకూరు, వావిళ్ల, దంపూరు, రామతీర్థం, గాదెలదిన్నె, పొన్నపూడి లక్ష్మీపురం,పార్లపల్లి, రామచంద్రాపురం, ముదివర్తి గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న 16 మంది బాధిత కుటుంబసభ్యులకు సుమారు రూ.6.60లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన గత 19 నెలల్లో 533 అనారోగ్య బాధితులకు సుమారు రూ.6.50కోట్లను అందచేశామన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో 11 మందికి సుమారు రూ.9లక్షల చెక్కులను అందజేశామన్నారు. ఈసందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకి, సీఎం నారా చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, మండలాధ్యక్షుడు ఏటూరు హరిరెడ్డి, టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, వెల్లంపల్లి దిలీప్, సత్యవోలు సత్యంరెడ్డి, కొమ్మి శ్రీదర్‌నాయుడు, ఆవుల వాసు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలమ్మపాళెం వంతెన పరిశీలన

వెంకటాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుమలమ్మపాళెం వంతెనను గురువారం సర్వేపల్లి జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తిరుమలమ్మపాళెం గ్రామస్థులు భారీ వర్షాలు, తుఫాన్, వరదల కారణంగా ప్రస్తుతం ఉన్న వంతెన మీద రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. హైలెవెల్ వంతెన నిర్మాణం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, ఆదిశగా ఎమ్మెల్యే సోమిరెడి చొరవ చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు పినిశెట్టి మహేష్, సందూరి శ్రీహరి, సందీప్, మస్తానయ్య, రామకృష్ణయ్య పాల్గొన్నారు.

కూలిన స్టేషన్ సీలింగ్ : తప్పిన ప్రమాదం

విడవలూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షాలకు విడవలూరు పోలీసు స్టేషన్ సీలింగ్ గురువారం కూలిపోయింది. ఆ సమయంలో పోలీసులు ఎవరూ లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం మేరకు, పోలీసు స్టేషన్‌ని సుమారు ఏడేళ్ల క్రితం సుమారు రూ.74లక్షలతో నిర్మించారు. నిర్మాణ క్రమంలో పైన శ్లాబు వేయకుండా తాత్కలికంగా రేకులు వేసి లోపల థర్మాకోల్‌తో సీలింగ్ వేశారు.కొద్ది రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా భారీగా వర్షం పడటంతో రేకుల నుంచి నీరు కిందకి కారటంతో థర్మాకోల్ షీట్‌లు దెబ్బతిని ఒక్కసారిగా కింద పడిపోయాయి. ఆ సమయంలో పోలీసులు లేకపోవడంతో ప్రాణ నష్టమేమి జరగలేదు. విషయం తెలుసుకున్న ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, కొడవలూరు సీఐ సురేంద్రబాబులు సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసు స్టేషన్‌ని పరిశీలించి. ఎస్ఐ నరేష్‌కుమార్ యాదవ్‌తో మాట్లాడారు.

ఘనంగా ఘంటసాల జయంతి

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ భవన్‌లో గురువారం బుచ్చి కళా హృదయాలు సేవా ట్రస్టు అధ్వర్యంలో పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 104వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలకు ఆటల పోటీలు నిర్వహించారు. పలువురు ఆలపించిన ఘంటశాల పాటలు అందరినీ అలరించాయి. పోటీలకు ఐవీ.రత్నకుమార్, గండికోట సుధీర్‌కుమార్, శ్రీకర్‌బాబు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులతోపాటు పాల్గొన్న వారందరికీ కన్సొలేషన్ బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు తిరుమూరు రాధాకృష్ణయ్య, వల్లూరు వెంకటేశ్వర్లు, సేవాట్రస్టు గౌరవ అధ్యక్షుడు జక్కా వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు చింతాల ప్రసాద్‌బాబు, ఉపాధ్యక్షుడు సురేష్‌రెడ్డి, సభ్యులు బాలు, సురేష్ పాల్గొన్నారు.

ఇడిమేపల్లిలో కాకాణి పర్యటన

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడిమేపల్లిలో గురువారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పర్యటించారు. ఈసందర్భంగా ఇడిమేపల్లి చెరువు, ముంపునకు గురైన పొలాలు, లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం లోతట్టు ప్రాంతాలవారికి వైసీపీ నేతలు ఏర్పాటు చేసిన భోజన సదుపాయాన్ని పర్యవేక్షించారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించడంతోపాటు వరినాట్లు పూర్తయిన రైతులకు నష్టపరిహారం అందించాలని కాకాణి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కే. కోదండరామిరెడ్డి, ఎం. వెంకటశేషయ్య పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

పెంచలయ్య హత్య కేసులో..

మరో ఆరుగురి అరెస్ట్

● 17కు చేరిన నిందితుల సంఖ్య

నెల్లూరు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో ఇటీవల సీపీఎం నాయకుడు పెంచలయ్యను హత్య చేసిన గంజాయి ముఠాకు చెందిన మరో ఆరుగురు నిందితులను నెల్లూరు రూరల్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. తొలుత ఈ నేరంతో 14 మందికి సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించగా లోతైన దర్యాప్తు జరపడంతో మరో ముగ్గురికి కూడా సంబంధం ఉన్నట్లు తేలిందని తెలిపారు. దీంతో నిందితుల సంఖ్య 17కు చేరింది. వారిలో ఏడుగురిని ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. తాజాగా మరో ఆరుగుని అరెస్టు చేశారు. ప్రధాన సూత్రధారి అరవ కామాక్షిని గంజాయి కేసులో నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. మరో నిందితుడు జేమ్స్ పోలీసులపై తిరబడి వారు జరిపిన కాల్పుల్లో గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఇంకో ఇద్దరు నిందితులను పట్టుకోవాల్సి ఉంది.

వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

• ఒట్లూరులో విషాదం

కావలి రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారుడు పొన్నాడి ఏడుకొండలు(57) ప్రమాదశాత్తు నీటమునిగి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం కావలి మండలం ఒట్టూరు తీరంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు, ఒట్టూరుకి చెందిన ఏడుకొండలుకి నలుగురు కుమార్తెలు. రెక్కాడితేకానీ డొక్కాడని నిరుపేద కుటుంబం. ఈ క్రమంలో నిత్యం సముద్రతీరానికి 20 అడుగుల దూరంలో కర్రలు కట్టి వలవేసి చిక్కిన చేపలతో జీవనం సాగిస్తుంటాడు. ఎప్పటిలాగే గురువారం మధ్యాహ్నం 2గంటలకు వలవేసి రావటానికి వెళ్లాడు. కర్రకు వల వేస్తుండగా కాలు చిక్కుకుంది. ఆ సమయం లో అక్కడ ఎవరూ లేకపోవటంతో నీటమునిగి మృతి చెందాడు. కొంతసేపటికి తీరం వద్దకు వచ్చిన మత్స్యకారులు తీరానికి సమీపంలో వలలో చిక్కుకుని నీళ్లలో తేలుతున్న ఏడుకొండలు మృతదేహాన్ని చూసి, ఒడ్డుకు చేర్చి పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి రూరల్ ఎస్ఐ తిరుమలరెడ్డి, పంచాయతీ అభివృద్ధి అధికారి అబ్దుల్ సమద్, వీఆర్వో రమణయ్య చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఏడుకొండలు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రౌడీషీటర్‌పై రెండోసారి పీడీ యాక్ట్

నెల్లూరు(క్రైం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఓ రౌడీషీటర్‌పై వేదాయపాళెం పోలీసులు రెండవ సారి పీడీ యాక్ట్‌ను ప్రయోగించారు. వేదాయపాలెం రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతానికి చెందిన దేవళ్ల జయప్రకాష్ అలియాస్ గూడూరు జయపై వేదాయపాలెం స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. ఆయనపై 14 కేసులున్నాయి. 2022 మేలో పోలీసు అధికారులు ఆయనపై పీడీ యాక్ట్ ప్రయోగించి కడప కేంద్ర కారాగారానికి పంపారు. కొంతకాలం జైలులో ఉండి బయటకు వచ్చాడు. అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడం, నేరాలకు పాల్పడుతూనే ఉండటంతో గురువారం మరోమారు పీడీ యాక్ట్ ప్రయోగించినట్లు వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ కే శ్రీనివాసరావు తెలిపారు.

ఫోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

దుత్తలూరు(ఉదయగిరి), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫోక్సో కేసులో నిందితుడైన యువకుడిని అరెస్టు చేసి ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి అంజయ్య రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ఆదిలక్ష్మీ గురువారం తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని గతనెల 19వ తేదీ నుంచి కనిపించడంలేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదులో భాగంగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతుండగా అదే గ్రామానికి చెందిన యువకుడు వెంగబాబు తీసుకెళ్లాడని రుజువు కావడంతో అతనిపై ఫోక్సో కేసు నమోదు చేశామన్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఆ యువకుడిని అరెస్టు చేసి ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి 14 రోజులపాటు రిమాండ్ విధించడంతో జైలుకు తరలించినట్లు ఆమె తెలిపారు.

మరో కేసులో..

ఉదయగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లాయపల్లి ఎస్సీ కాలనీ సమీపాన గల అటవీ ప్రాంతంలో వదిన, మరదలిపై గొడ్డలితో దాడి చేసిన బొబ్బా ఆదినారాయణకు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి గురువారం తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి అంజయ్య ఈనెల 17వ తేదీ వరకు రిమాండ్ విధించగా జైలుకు తరలించామన్నారు.

పాముకాటుతో యువకుడి మృతి

జలదంకి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపాలెంలో బుధవారం అర్ధరాత్రి పాముకాటుతో బొబ్బాల అరవింద్(26) మృతిచెందాడు. పొలం పనులకు వెళ్లిన అరవింద్ పొలంలో పని చేస్తుండగా పాముకాటేయడంతో వెంటనే చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స చేస్తుండగానే మృతి చెందాడు. చేతికొచ్చిన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. గురువారం ఉదయం విషయం తెలుసుకున్న గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.



మృతిచెందిన అరవింద్

మృతదేహం ఆచూకీ లభ్యం

ఉదయగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్ జిల్లా సగన్వ గ్రామానికి చెందిన సౌరభ్‌కుమార్ మృతదేహం గురువారం లభ్యమైంది. ఎస్ఐ అల శ్రీను ఆధ్వర్యంలో మత్స్యకారులు జలాశయం నీటిలో మూడు రోజులుగా గాలింపు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సేవ్ రాపూరు, కలువాయి!

(5వ పేజీ తరువాయి)

జరిగితే రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు ఎన్నో రకాల సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకు గట్టి ప్రయత్నం చేయాలని నాయకులంతా నిర్ణయించుకున్నారు. అవసరమైతే పార్టీలకు అతీతంగా పోరాడుదామని నిర్ణయించుకున్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, జిల్లా మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణల ద్వారా ప్రభుత్వ పెద్దలను ఒప్పించి సాధించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం బస్టాండు వరకు టీడీపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. తిరుపతి వద్దు.. నెల్లూరు ముద్దు అంటూ నినాదాలు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	139
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	274

కోడిగుడ్ల ధర (100): 670

వియానీ హోంలో ఘనంగా నౌకాదళ దినోత్సవం

నెల్లూరు(విద్య), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వెంగళరావు నగర్ మునిసిపల్ పాఠశాలలోని 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో పొదలకూరురోడ్డులోని వియానీ హోంలో గురువారం భారత నౌకాదళ దినోత్సవం నిర్వహించారు. ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు మాట్లాడుతూ 1971 భారత్-పాక్ యుద్ధంలో భారత్ ఘన విజయం సాధించడంలో భారత నేవీ కీలక పాత్ర పోషించిందని చెప్పారు. అప్పటి నుంచి ఏటా డిసెంబరు 4వతేదీన అమరులైన సైనికుల ను స్మరిస్తూ ఇండియన్ నేవీ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేటి యువత దేశభక్తిని పెంపొందించుకుని ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. అనంతరం ఎన్‌సీసీ కేడెట్స్ హోంలోని విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హోం నిర్వాహకుడు రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి చాగంటి ప్రవచనాలు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : శ్రీభరద్వాజ రుద్రాభిషేక సంఘం ఆధ్వర్యంలో శనివారం నుంచి ఈ నెల 10వతేదీ వరకు ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు జరుగుతాయని ఆడిటర్ ఎస్‌వీఎస్ రాఘవేంద్రరావు ఓ ప్రకటనలో తెలిపారు. మార్గశిర మాసం సందర్భంగా ఆదిశంకరాచార్య కృత జగన్నా థాష్టకంపై చాగంటి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ప్రతీరోజు సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు నెల్లూరు టౌనుహాలులో జరుగుతుందని, భక్తులందరూ తరలిరావాలని ఆయన కోరారు.

పట్టణ భూ రికార్డులకు నిధులపై హర్షం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ భూ రికార్డుల తయారీ కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ జియో ఆధారిత పట్టణ నివాసాల భూ సర్వే-రక్షా కింద రాష్ట్రానికి రూ.125 కోట్లు మంజూరు చేసిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా పట్టణ పరిధిలో ఉన్నటువంటి భూ రికార్డులు సక్రమంగా తయారు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పట్టణ భూ రికార్డులకోసం నిధులివ్వడంపై హర్షం వ్యక్తం చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నెల్లూరు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ఏడు కుటుంబాలకు రూ. 21 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి నగదు చెక్కులను ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి గురువారం అందచేశారు. మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ పాల్గొన్నారు.

బాబా గుడిలో అన్నదానం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దత్త జయంతి సందర్భంగా గురువారం అయ్యప్పగుడి సమీపంలోని నాగసాయిబాబా మందిరంలో విశేష పూజలు, గురువారం అన్నదానం జరిగాయి. ఎల్‌పీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పదేళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్పొరేటర్ బీ పురుషోత్తం, కాలేషా పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీలలో మైక్రో ఎంటర్‌ప్రైజెస్ ఎన్ని?

- లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, ముఖ్యంగా నెల్లూరు జిల్లాలో స్వయం సహాయక సంఘాలలో మైక్రో ఎంటర్‌ప్రైజెస్ ఎన్ని ఉన్నాయని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గురువారం లోక్‌సభలో ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సుశ్రీ శోభా కరంద్లాజే సమాధానమిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో ఎస్‌హెచ్‌జీలు 1,30,171 మైక్రో ఎంటర్ ప్రైజెస్ నిర్వహిస్తున్నాయని, నెల్లూరులో 5198 నిర్వహిస్తున్నాయని వివరించారు. ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల రిజిస్ట్రేషన్ కోసం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ప్రారంభించామని తెలిపారు.

గూడూరును నెల్లూరులో విలీనం చేయాలి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం గూడూరును నెల్లూరులో విలీనం చేయాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డు ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గూడూరుకు తిరుపతి కన్నా నెల్లూరు దగ్గరని, విద్యార్థులు, ప్రజల సౌకర్యార్థం గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు.

పరిశుభ్రతపై అవగాహన

నెల్లూరు(విద్య), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కొత్తూరు పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయలో గురువారం ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు స్థానిక ప్రజలకు, విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రతకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీకేడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కన్యాకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన...

డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ గిరి మాట్లాడుతూ ఎయిడ్స్ కేసులు పెరుగుతున్న కారణాలను, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియచేశారు. అనంతరం విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ ప్రజంటేషన్, పెయింటింగ్, రంగోలి, రీల్ మేకింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ ఐ సుభాషిణి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇళ్ల చుట్టూ వర్షపు నీటితో జలమయమైన ఎన్టీఆర్ నగర్

నగరంలో 21 సెం.మీ.
రూరల్లో 24 సెం.మీ.

నెల్లూరు(సిటీ), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరం, రూరల్ ప్రాంతాలను ఐదురోజులుగా వర్షాలు ముంచెత్తుతున్నాయి. నగరంలో నవంబరు 30వ తేదీ నుంచి గురువారం (ఉదయం 8.30 గంటలు) వరకు 217.4 మి.మీ (21 సెం.మీ) వర్షం కురిసినట్లు గణాంక శాఖ తెలిపింది. 30వ తేదీన 30.8 మి.మీ, ఈ నెల 1న 25.2, 2న 67.6, 3న 75 మి.మీ, 4న 18.8 మి.మీ చొప్పున వర్షం కురిసిందని అధికారిక వర్గాలు ప్రకటించాయి. ఇక, రూరల్ విషయానికి వస్తే ఈ ఐదు రోజుల్లో 240.4 మి.మీ (24 సెం.మీ) వర్షం పడినట్లు అధికారులు లెక్కతేల్చారు. 30వ తేదీన 35.2మి.మీ, 1న 32.4, 2న 48.2, 3న 104.4 మి.మీ, 4వ తేదీన 20.2 మి.మీ చొప్పున వర్షం పడినట్లు గురువారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం 8.30 గంటల తరువాత పడిన వర్షం వివరాలు అందాల్సి ఉంది.



మొగళ్ళపాళెం వద్ద చెరువుకు పడిన గండి

కుండపోత

- దంచికొట్టిన వాన ● అంబాపురం కాలువకు గండి
- ఉడుముల వాగు కట్టతెగి 1500 ఇళ్లు మునక
- జలాధివాసంలో లోతట్టు ప్రాంతాలు
- జలాశయాలుగా అండర్ బ్రిడ్జిలు
- వర్షానికి పైకి పొంగిన భూగర్భ మురుగు
- వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం

నెల్లూరు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో గురువారం కుండపోత వర్షం కురిసింది. దిత్వా తుపాను తీరం దాటాక కొనసాగుతున్న వాయుగుండ ప్రభావంతో వర్షాలు ముంచెత్తుతు న్నాయి. బుధ, గురువారాల్లో ఏకధాటిగా కురిసిన వర్షానికి నగరం అంతలాకుతలమైంది. గురువారం ఉరుములు, మెరుపులు, పిడుగు లతో వాన కుమ్మరించడంతో జనజీవనం స్తంభించింది. నగరంలో ఎక్కడ చూసినా నీళ్లే కనిపిస్తున్నాయి. కాలువలు పొంగి మురుగుతో కలిసి రోడ్ల మీదకు చేరుతున్నాయి. నగర తూర్పు, పడమర ప్రాంతా లను కలిపే అండర్‌బ్రిడ్జీలు జలాశయాలుగా మారడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇక, ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నగర శివారునున్న లోతట్టు ప్రాంతాలు జలాధివాసం చేస్తున్నాయి. నివాసాల్లోకి వరద నీళ్లు చేరి ఇళ్లు, రోడ్లు ఏకమయ్యాయి. ఖాళీ స్థలాలు చెరువులుగా మారాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వరుస వానలతో దినసరి కూలీలు, రోడ్డు మార్జిన్ వ్యాపారులు ఉపాధికి దూరమయ్యారు.



రామకోటయ్య నగర్‌లో రోడ్డంతా నీళ్లే..!



నీట మునిగిన రామలింగాపురం అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

తెగిన వాగు... 1500 ఇళ్ల మునక

నగరంలోని అంబాపురం కాలువకు గండిపడటంతో అక్కడి వరద ప్రవాహమంతా ఉడుముల వాగుపై పడటంతో రెవన్యూ కాలనీ వద్ద వాగు కుడి గట్టు తెగి సమీప ప్రాంతాలు జలమయం అయ్యాయి. సుమారు 1500 ఇళ్లు నీట మునిగాయి. స్థానిక ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. తల్పగిరికాలనీ, డ్రైవర్స్ కాలనీ, రామకోటయ్య నగర్, బుజబుజ నెల్లూరు, అయ్యప్పగుడి సర్కిల్, ఆటోనగర్, పడారుపల్లి, సుందరయ్య కాలనీ, జనశక్తినగర్, వేదాయపాళెం, మాగుంటలేఅవుట్, కేవీ ఆర్ కూడలి, మనుమసిద్ధి నగర్, మన్సూర్‌నగర్, మూలపేట, రంగనాయకులపేట, రైల్వే స్టేషన్ రోడ్డు నీటితో నిండాయి. నెల్లూరు తాలుకా రెవెన్యూ కార్యాలయ ప్రాంగణం చెరువును తలపించింది. తడికల బజార్, లక్ష్మీపురం, నవాబుపేట, ఎన్టీఆర్ నగర్, మైపాడుగేట్ కూడలి వద్ద భారీగా వర్షపు నీళ్లు చేరడం తో వాహనాలు వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. కాగా, మున్సిపల్ కమిషనర్ నందన్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, టీడీపీ నేత గిరిధర్ రెడ్డి, కార్పొరేటర్లు రంగంలోకి దిగి లోతట్టు ప్రాంతాల్లోని వరద నీటిని దారి మళ్లించి వాహన రాకపోకలను పునరుద్ధరించారు. పలు స్కూళ్లు, కాలేజీలకు మధ్యాహ్నం నుంచి సెలవు ఇవ్వడంతో విద్యార్థులు వర్షంలో ఇళ్లకు చేరేందుకు ఇబ్బంది పడ్డారు. ఇదిలా ఉండగా కార్పొరేషన్ అధికారులు నగర వ్యాప్తంగా 19 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముంపు ప్రాంతాల్లో రెండో రోజు కూడా ఆహారం పంపిణీ చేశారు.



సౌత్‌మోపూరు బీసీకాలనీ వద్ద పొలాల్లోకి పారుతున్న నీరు, నేలకూలిన విద్యుత్ స్తంభం



ఉధృతంగా ప్రవహిస్తున్న కనుపూరు కాలువ

పల్లెలంతా నీళ్లు !

- ఉధృతంగా కనుపూరు కాలువ ● మొగళ్ళపాళెం చెరువుకు గండి
- ప్రమాదకరంగా పొట్టేపాళెం, ములుముడి కలుజులు
- చెరువుల్లా పొలాలు ● నడవని మగ్గాలు
- సౌత్‌మోపూరులో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

నెల్లూరు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ ప్రాంతంలో ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కలుజుల వద్ద నీటి ప్రవాహం ప్రమాదకరస్థాయికి చేరింది. వందలాది ఎకరాల్లో వరి దెబ్బతినడంతో రైతులు బోరుమంటున్నారు.

- రూరల్ మండలం మీదుగా సాగే కనుపూరు కాలువలో 1000 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. ఆ నీటి ఒరవడికి మొగళ్ళపాళెం చిన్న చెరువుకు గండిపడింది. దీంతో సమీప పంటపొలాలన్నీ మునిగాయి.
- ములుముడి వద్ద కలుజు 600 క్యూసెక్కుల వరద ప్రవాహంతో ఉధృతంగా పారుతోంది. ఇక్కడ వాహనాలు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.
- పొట్టేపాళెం కలుజు వద్ద ప్రత్యామ్నాయ రోడ్డు కొట్టుకుపోవడంతో అధికారులు, అధికార పార్టీ నాయకులు యుద్ధప్రాతిపదికన ఆధునీకీకరణ పనుల చేసి రాకపోకలు పునరుద్ధరించారు.
- సౌత్‌మోపూరు బీసీ కాలనీలో 11కేవీ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.
- సౌత్‌మోపూరు, ములుముడి, నారాయణరెడ్డిపేట ప్రాంతాల్లో చేనేత మగ్గం గుంతల్లోకి నీరు చేరడంతో నేతపని నిలిచిపోయింది.
- నారేతలు పూర్తయిన 200 ఎకరాలు, నారుమళ్లతో ఉన్న మరో 500 ఎకరాలపైరు పూర్తిగా దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది.
- పల్లెల్లోని దళితవాడలు, గిరిజన కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.
- మట్టెంపాడు వద్ద కొన్ని ప్రాంతాలలో ఇళ్లలోకి వరద నీరు చేరింది.



ములుముడిలో నీట మునిగి దెబ్బతిన్న నారుమళ్లు

కాలువలపై అక్రమ నిర్మాణాల కూల్చివేత

నెల్లూరు(సిటీ), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : నగరంలోని కాలువలపై అనుమతులు లేకుండా నిర్మించిన పలు కట్టడాలను సిటీ ప్లానింగ్ అధికారులు గురువారం యంత్రాలతో కూల్చేశారు. పొగతోట ప్రాంతంలోని మూడు సినిమా హాళ్ల వీధి నుంచి రామలింగాపురం అండర్ బ్రిడ్జికి వెళ్లే దారిలోని ములుపు వద్ద అక్రమ నిర్మాణాలున్నట్లు గుర్తించిన అధికారులు వాటిని తొలగించారు. ఆ ప్రాంతంలో వరద ప్రవాహం బయటకు వెళ్లేందుకు కాలువ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.



పొట్టేపాళెం కలుజు వద్ద రూ.4.80 కోట్లతో వంతెన

- జనవరిలో శంకుస్థాపన : టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి



కలుజును పరిశీలిస్తున్న గిరిధర్‌రెడ్డి, అధికారులు

నెల్లూరు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : ఏటా వర్షాకాలంలో నీటి ఉధృతితో ప్రమాదకరంగా పరిణమించిన పొట్టేపాళెం కలుజు వద్ద త్వరలో వంతెన నిర్మిస్తున్నట్లు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. రూ. 4.80 కోట్లతో ఆ వంతెన నిర్మాణానికి జనవరిలో శంకుస్థాపన జరుగుతుందని ప్రకటించారు. ఆయన గురువారం ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి కలుజు ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా కలుజు వద్ద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ఇక్కడ వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ నెల 16వ తేదీతో టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందని, వచ్చే నెలలో పనులు మొదలవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదగిరి క్షేత్రం చైర్మన్ ఇందుపూరు అచ్యుతరెడ్డి, నెల్లూరు ఏఎంసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

చేనేతలను ప్రభుత్వం ఆదుకోవాలి

- నారాయణరెడ్డిపేటలో నాయకుల పరామర్శ

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను చేనేతలపై తీవ్రమైన ప్రభావం చూపిందని మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, చేనేత ఐక్యకార్యాచరణ కమిటీ అధ్యక్షుడు బుధవరపు బాలాజీ వెల్లడించారు. మగ్గం గుంతల్లో నీరు చేరడం, నూలు తడిసిపోవడంతో నేత కార్మికులు నష్టపోయారని, వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. నెల్లూరు రూరల్ మండలం నారాయణరెడ్డిపేటలోని చేనేత కార్మికులను గురువారం వారు పరామర్శించారు. తుఫాను కారణంగా చేనేత పరిశ్రమ పూర్తిగా మూతపడిందని, ప్రభుత్వ సాయం అత్యవసరమన్నారు. మొంథా తుఫాను సాయం కూడా చాలా మందికి అందలేదని ఆ రోపించారు. ఈ కార్యక్రమంలో ఐకా నాగేశ్వర రావు, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.



చేనేతలను పరామర్శిస్తున్న రాధయ్య, బాలాజీ

డీడీవోలతో గ్రామాల్లో పటిష్ట పాలన

- ప్రారంభోత్సవంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ బీద

నెల్లూరు(జడ్పీ), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): డివిజనల్ అభివృద్ధి అధికారుల(డీడీవో) వ్యవస్థతో గ్రామాల్లో మరింత పటిష్ట పాలన సాగుతుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిన 77 డీడీవో కార్యాలయా లను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్తూరు జిల్లా నుంచి గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. నెల్లూరులోని జడ్పీ కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన నెల్లూరు డీడీవో కార్యాలయ ప్రారంభోత్సవంలో అరుణమ్మ, రవిచంద్ర పాల్గొన్నారు. అరుణమ్మ మాట్లాడుతూ పంచాయతీరాజ్ పాలనను మరింత సులభతరం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేసిందన్నారు. రవిచంద్ర మాట్లాడుతూ జిల్లాలో ఐదు డీడీవో కార్యాలయా లను ప్రారంభించామని, వీటి ద్వారా కూటమి ప్రభుత్వం సరికొత్త అధ్యా యానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో మోహన్ రావు, జిల్లా పంచాయతీ అధికారి వసుమతి తదితరులు పాల్గొన్నారు.



డీడీవో కార్యాలయ ప్రారంభోత్సవంలో జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, ఎమ్మెల్సీ రవిచంద్ర, అధికారులు

రోశయ్య విగ్రహాలు ఏర్పాటు చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి, ముఖ్యమంత్రి, తమిళనాడు గవర్నర్‌గా పనిచేసిన కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాలను రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేయాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి షేగు షణ్ముఖరావు కోరారు. గురువారం కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతిని ది నెల్లూరు జిల్లా రైస్ కాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఆర్యవైశ్య నాయకులు పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నెల్లూరులో రోశయ్య విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం చీఫ్ ఆర్గనైజర్ కోట గురుబ్రహ్మం, ఈసీ మెంబరు భవనాశి సురేష్, ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్ జొన్నలగడ్డ మోహన్ రావు, ఆర్యవైశ్య ఇంటర్నేషనల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గాదంశెట్టి హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు



వీటిని ఇలా వదిలేస్తారా?

మండల కేంద్రం సంగంలోని ముంబయి జాతీయ రహదారి పక్కన కొండ ప్రాంతంలో బయో మెడికల్ వ్యర్థాలు గురువారం ప్రత్యక్షమయ్యాయి. వీటిలో కాలం చెల్లిన మందులతోపాటు సూదిమందులు, ఇతర బయో మెడికల్ వ్యర్థాలు ఉన్నాయి. సాధారణంగా ఆసుపత్రులు, క్లినిక్‌లు, ఫార్మసీలు బయో మెడికల్ వ్యర్థాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శుద్ధి కేంద్రాలకు తరలించి, నిర్వీర్యం చేయాలి. అయితే, గుర్తుతెలియని వ్యక్తులు వాటిని ఎక్కడ నుంచో తరలించి, హైవే పక్కన పడేశారు. ఉన్నతాధికారులు స్పందించి, సమగ్రంగా విచారణ చేసి ఇందుకు కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)



కోన ఆదాయం కోటి దాటింది!

● 91 రోజులకు రూ.1,11,61,254 రాబడి

రాపూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో గురువారం ఉదయం శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీ, ఆంజనేయస్వామి ఆలయాల్లోని హుండీల కానుకలను లెక్కించారు. 91రోజులకు మొత్తం రూ.1,11,61,254 నగదు, మిక్స్ బంగారు ఆభరణాలు 240.095 మిల్లీగ్రాములు, వెండి ఆభరణాలు 2.870మిల్లీగ్రాములు, విదేశీ కరెన్సీ యూఎస్ఏ 20 డాలరు-1, యూఎస్ఏ 1 డాలర్స్ -5, యూఎస్ఈ 5దినార్స్ -1, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇరాక్ 250దినార్స్- 1, ఇంగ్లాండ్ 10పౌండ్స్ -4, కువైట్ 1దీనార్‌లు -5, 1/2దినార్స్ -2, 1/4దినార్స్ -6 వచ్చినట్లు ఆలయ ఉపకమిషనర్ పీ.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నెల్లూరు వేణుగోపాలస్వామి ఆలయ అధికారి జే శ్రీనివాసులు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించారు. వచ్చిన రాబడిని ఏపీజీబీ పెంచలకోన బ్రాంచ్‌లో జమ చేశామని ఉపకమిషనర్ తెలిపారు.



గరుడ వాహనంపై వేదగిరీశుడు

నెల్లూరు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మార్గశిర పౌర్ణమి పర్వదినం సందర్భంగా వేదగిరి క్షేత్రంలో లక్ష్మీ నరసింహస్వామికి గురువారం గరుడ సేవ, గిరిప్రదక్షణ ఉత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఇందుపూరు అచ్యుతరెడ్డి, ఈవో గోపి, ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్లపై ఫోకస్

పోలీసు స్టేషన్లలో ఏమి జరుగుతోంది?.. స్టేషన్ అధికారులకు దగ్గరగా ఉండే ఐడీ పార్టీలు ఏమి చేస్తున్నాయి?.. వారితో స్టేషన్ అధికారులు ఎలాంటి పనులు చేయిస్తున్నారు... ఐడీ పార్టీల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారా?... ఇలా జిల్లాలోని అన్నీ పోలీసు స్టేషన్లలో జరిగే విషయాలపై ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆరా తీస్తున్నారు. దీంతో కొందరు సిబ్బంది, అధికారుల్లో వణుకు ప్రారంభమయ్యింది. మరోవైపు నేరాలను ఎందుకు నియంత్రించలేకపోతున్నారు?, క్రైమ్ పార్టీలు ఏమి చేస్తున్నాయి? అనే కోణంలోనూ ఎస్పీ వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

● దృష్టిపెట్టిన ఎస్పీ అజిత ● ఐడీ పార్టీల జాబితా సేకరణ

● అధికారులు, సిబ్బందిలో వణుకు

● సీసీఎస్, ఎస్‌బీలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఖాకీలు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్నీ పోలీ సు స్టేషన్లలో అధికారులకు దగ్గరగా ఉండే ఐడీ పార్టీల వివరాలపై ఎస్పీ ఆరా తీశారు. ప్రతీ స్టేషన్ అధికారి ఐడీ పార్టీ వివరాలు పంపాలని ఆదేశించారు. ఆ జాబితా ప్రస్తుతం జిల్లా పోలీసు కార్యాలయానికి చేరింది. జాబితాలో ఉన్న సిబ్బంది పనితీరు, ఎప్పటి నుంచి ఆ స్టేషన్‌లో పనిచేస్తున్నారు.. తదితర వివరాలను స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది నుంచి సేకరిస్తున్నట్లు సమాచారం. ఆ తర్వాత ఎలాంటి చర్యలు ఉంటాయనేది ఆసక్తికరంగా మారింది.

సీసీఎస్, ఎస్‌బీలో పాతుకుపోయిన సిబ్బంది

జిల్లాలోని అనేక పోలీసు స్టేషన్లలో కొందరు సిబ్బంది ఏళ్ల తరబడి పాతుకుపోయారు. ఐదేళ్లకు ఒకసారి బదిలీలు చేపట్టినా అధికార పార్టీ నాయకుల సిఫార్సులతో ఆ పోలీసు స్టేషన్‌లోనే ఉండిపోతున్నారు. అది సాధ్యం కాకపోతే అటాచ్‌మెంట్‌పై మళ్లీ అదే స్టేషన్‌కు వచ్చేస్తున్నారు. ఈ క్రమంలో నేరస్థులకు అండగా ఉంటున్నారన్న ఆరోపణలున్నాయి. సీసీఎస్, ఎస్‌బీలలో ఏళ్ల తరబడి సిబ్బంది పాతుకుపోయారని, వారిని ఏ అధికారీ కదిలించరన్న అభిప్రాయం పోలీసు వర్గాల్లో ఉంది. ఈ క్రమంలో ఎస్పీ ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.



నేరగాళ్లపై ఉక్కుపాదం

● ర్యాప్ గ్యాంగ్‌లపై కఠినంగా...

● మీడియాతో ఎస్పీ డాక్టర్ అజిత

నెల్లూరు(క్రైం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రౌడీయిజం చలాయిస్తూ, గ్యాంగులు నడుపుతూ నేరాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతిభద్రతలతోపాటు వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ప్రత్యేక కార్యాచరణతో జిల్లాలోని ర్యాప్ గ్యాంగ్‌లపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. నకిలీ బంగారం, నకిలీ కరెన్సీ, రకరకాల ట్రాప్‌లతో ప్రజలను మోసం చేస్తున్న ముఠాలపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఇలాంటి వరుస నేరాలకు పాల్పడుతున్న కావలి పట్టణానికి చెందిన దేవరకొండ సుధీర్ అలియాస్ అజయ్‌రెడ్డి అలియాస్ జయారెడ్డిని ఇటీవలే కావలి పోలీసులు అరెస్ట్ చేశారని చెప్పారు. అతని రాష్ట్ర వ్యాప్తంగా 38 కేసులున్నాయని, పీడీ యాక్ట్ నమోదు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అల్లూరు మండలానికి చెందిన షేక్ హసన్ అలియాస్ అశోక్ అలియాస్ కార్తీక్‌రెడ్డిపై పలు జిల్లాల్లో 13 కేసులున్నాయని, గతంలో దేవరకొండ సుధీర్ గ్యాంగ్‌లో ఉంటూ మోసాలకు పాల్పడిన హసన్ విబేధాల కారణంగా మరో గ్యాంగ్‌ను తయారు చేసుకున్నాడని వివరించారు. తక్కువ రేటుకు బంగారు ఇస్తామని ప్రజలను హసన్ మోసం చేస్తూ నగదు దోచేస్తాడని తెలిపారు. టీపీ గూడూరుకు చెందిన మోనా సద్దాం అనే నేరస్తుడు హసన్ గ్యాంగ్‌లో ఉంటూ వారిమధ్య విభేదాలు రావడంతో మరో గ్యాంగ్‌ను ఏర్పాటు చేసుకొని ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి జిల్లాలో తక్కువ రేటుకు రొయ్యలు, చేపల సరుకు ఇప్పిస్తానని పిలిపించి నగదు దోచుకుని పరారవుతు న్నాడని తెలిపారు. సద్దాంపై మూడు కేసులున్నాయని, ప్రజలు ఇలాంటి గ్యాంగ్ లతో జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ సూచించారు. గత నెలలో నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ప్రజానాట్యమండలి సభ్యుడు పెంచలయ్య హత్య కేసులో 17 మంది నిందితుల ను చేర్చామని, వారిలో ప్రధాన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. పాత నేరస్థులు, రౌడీషీటర్లపై నిఘా ముమ్మరం చేశామని, నేరాలకు సహకరించే వారిపై సైతం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పెంచలయ్య కుటుంబానికి న్యాయం చేస్తాం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గంజాయి వ్యతిరేక పోరాటంలో ఇటీవల హత్యకు గురైన పెంచలయ్య కుటుంబం గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ అజితను కలిసింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆ కుటుంబానికి చట్టపరమైన సహాయం, రక్షణ, న్యాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పెంచలయ్య ఆశయాలను, స్ఫూర్తి ని కొనసాగించడంలో జిల్లా పోలీసులు అన్నీ విధాలా సహకరిస్తారని తెలి పారు. పెంచలయ్య హత్య ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుగుతోం దని, ఇప్పటికే ప్రధాన నిందితులను అరెస్టు చేశామని చెప్పారు. మిగిలిన వారి పాత్రపై లోతుగా విచారణ సాగుతోందని తెలిపారు. అనంతరం పెంచలయ్య కుటుంబ సభ్యులతో కలిసి గంజాయి వ్యతిరేక అవగాహన పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ అధికారుల మెడకు ఉచ్చు

● గతంలో అక్రమాలు చేసినట్లు నిర్ధారణ

● 13 మందిపై చార్జస్ ఫ్రేమ్ చేసిన ప్రభుత్వం

● గృహ నిర్మాణ శాఖలో సంచలనం

నెల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తప్పు చేస్తే ఎప్పటికైనా శిక్ష అనుభవించక తప్పదన్న సత్యం మరోసారి రుజువైంది. పేదల ఇళ్ల మాటున జరిగిన భారీ దోపిడీకి కారణమైన హౌసింగ్ అధికారుల మెడకు ఉచ్చు బిగుస్తోంది. ఒక్క నెల్లూరు నగర పరిధిలోని వెంకటేశ్వరపురం, కొండ్లపూడి లేఅవుట్లలోనే రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైనట్లు విచారణలో బయటపడింది. ఇందుకు సంబంధించిన విచారణ ఈ ఏడాది సెప్టెంబరులో జరిగింది. హౌసింగ్ శాఖ క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు జిల్లాకు వచ్చి విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. నిర్మించిన ఇళ్లకు మించి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించినట్లు నిర్ధారించారు. అలానే స్టీలు, సిమెంటు, ఇసుకను పక్కదారి పట్టించినట్లు కూడా గుర్తించారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. గత ప్రభుత్వంలో నెల్లూరు నగరంలో పనిచేసిన హౌసింగ్ అధికారులపై అభియోగాలు నమోదు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఒకేసారి ఏకంగా 13 మంది హౌసింగ్ అధికారులపై చార్జస్ ఫ్రేమ్ కావడం ఆ శాఖలో సంచలనం మారింది. అభియోగాలు నమోదైన అధికారులంతా పది రోజుల్లో తమ వివరణ సమర్పించాలని ఆదేశించింది. కొండ్లపూడి లేఅవుట్‌లో ఎక్సెస్ పేమెంట్లు ఇవ్వడంతో పాటు స్టీలు, సిమెంటు, ఇసుక పక్కదారి పట్టించగా, వెంకటేశ్వరపురం లేఅవుట్లో ఒకరు నిర్మించిన ఇళ్ల బిల్లులను మరొకరికి చెల్లించి అవకతవకలకు పాల్పడ్డారు. చార్జస్ అందుకున్న వారిలో పీడీ నుంచి ఏఈ స్థాయి అధికారుల వరకూ ఉండడం గమనార్హం. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం..

● గతంలో హౌసింగ్ నెల్లూరు ఈఈగా పనిచేసిన పీ దయాకర్ ఇటీవల తిరుపతి పీడీగా పనిచేస్తూ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈయన హయాంలో వెంకటేశ్వరపురం లేఅవుట్లో రూ.78.29 లక్షలు, రూ.21.03 లక్షల విలువ చేసే స్టీలు దుర్వినియోగమైంది. అలానే కొండ్లపూడి లేఅవుట్లో రూ.84.35 లక్షల నిధులను అధికంగా చెల్లించారు. రూ.34.44 లక్షల విలువ చేసే ఇసుక, రూ.6.60 లక్షల విలువ చేసే సిమెంటు, రూ.17.33 లక్షల విలువ చేసే స్టీలు దుర్వినియోగమైంది. అలానే అప్పట్లో ఇన్‌చార్జ్ డీఈగా పనిచేసి ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న ఎం మధుసూదనరావు కూడా రూ.కోటి విలువ చేసే నిధులు, స్టీలు, ఇసుక, సిమెంటును పక్కదారి పట్టించారని అభియోగం. అదే విధంగా అప్పట్లో ఏఈగా పనిచేసిన ఎం కృష్ణారెడ్డి కూడా రూ.78.29 లక్షల ప్రజాధనం దుర్వినియోగం అవ్వడానికి బాధ్యులుగా పేర్కొన్నారు.

● గతంలో ఇన్‌చార్జ్ పీడీగా పనిచేసిన ఏ నాగరాజు సమయంలో కొండ్లపూడి లేఅవుట్లో రూ.49.30 లక్షల విలువైన నిధులు, సిమెంటు, ఇసుక, స్టీలు దుర్వినియోగమయ్యాయి. అప్పట్లో ఏఈగా పనిచేసి ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న జీ రామకృష్ణ రూ.26.30 లక్షల నిధుల దుర్వినియోగానికి బాధ్యుడిగా పేర్కొన్నారు. ఏఈగా పనిచేసిన పీ అహ్మద్ భాషా రూ.6.60 లక్షలు, ఈఈగా పనిచేసిన పీ నరసింహం రూ.12.05 లక్షల నిధుల దుర్వినియోగానికి బాధ్యులుగా అభియోగం నమోదు చేశారు.

● గతంలో ఈఈగా పనిచేసిన టీవీ శేషయ్య హయాంలో రూ.1.40 లక్షలు, ఏఈ టీ భాస్కర్ రావు ద్వారా రూ.2.20 లక్షలు, ఏఈ పల్లా వెంకటదాస్ ద్వారా రూ.2.20 లక్షలు, మరో ఏఈ పీ సురేష్ కుమార్ హయాంలో రూ.4.70 లక్షలు, డీఈ జహీరుద్దీన్ అహ్మద్, ఈఈ మోహన్‌రావు హయాంలో రూ.60 వేల చొప్పున ఎక్సెస్ పేమెంట్ జరిగినట్లు చార్జస్ ఫ్రేమ్ చేశారు.

ప్రభుత్వ సేవల సులభతరమే లక్ష్యం

● మంత్రి ఆనం రామనారాయణ ● జిల్లావ్యాప్తంగా డీడీవో కార్యాలయాల ప్రారంభం

ఆత్మకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టపరిచి గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభతరం చేయడమే లక్ష్యంగా డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీవో) కార్యాలయాలను ప్రభుత్వం ప్రారంభించిం దని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆత్మకూరులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డీడీవో కార్యాలయాన్ని గురువారం అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆనం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో వర్చువల్‌గా మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా డీడీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేసేలా, ఒకే తరహా డిజైన్లతో భవనాలు రూపొందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరులో త్వరలోనే సొంత భవనం నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. వీర్లగుడిపాడుకు రాకపోకలు కల్పించేందుకు బీరాపేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో డివిజనల్ అభివృద్ధి అధికారి రమణయ్య, ఆర్డీవో పావని, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్ రెడ్డి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, జిల్లావ్యాప్తంగా నెల్లూరు, కందుకూరు, కావలి రెవెన్యూ డివిజనల్ కేంద్రాల్లోనూ డీడీవో కార్యాలయాలను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు.



ఆత్మకూరులో డీడీవో కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

విద్యాబోధనకు ఇన్‌స్ట్రక్టర్స్

● ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు... ● ఐదు నెలల కాలానికి నియామకాలు

నెల్లూరు(విద్య), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే ఈ ప్రక్రియలో భాగంగా జిల్లాలో 70 పోస్టులను భర్తీ చేసేందుకు సన్నాహాలు ప్రారంభించారు. సబ్జెక్ట్ టీచర్లతోపాటు ఎస్‌జీటీలను సైతం నియమించాలని ఆదేశాలు జారీ చేస్తూ వారి వేతనాలను కూడా ఖరారు చేశారు. ఆయా మండలాల పరిధిలో ఈనెల 5వ తేదీ లోపల అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని నోటిఫికేషన్‌లు జారీ చేశారు. గతంలో విద్యావలంటీర్ల పేరుతో తాత్కాలిక ఉపాధ్యాయుల కొరత తీర్చగా ఈ ఏడాది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్‌గా పేరు మార్చుచేసి ఉపాధ్యాయుల కొరత తీర్చనున్నారు. మెగా డీఎస్సీలో ఇటీవల కొత్త ఉపాధ్యాయులు నియామకం చేపట్టినా వీటిలో ఇంకా పోస్టులు ఖాళీగా ఉండడంతో వీటిని పరిగణలోకి తీసుకుని కొత్తగా నియామకాలు చేపడుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలో మిగిలిన ఐదునెలలు మాత్రమే వీరిని తాత్కాలిక ప్రాతిపదికన విధుల్లోకి తీసుకుంటున్నారు.

● జిల్లాలో 70 పోస్టులు..

జిల్లాలో స్కూల్ అసిస్టెంట్స్ తెలుగు 12, హిందీ 13, సంస్కృతం 2, ఉర్దూ 15, ఇంగ్లీష్ 7, మ్యాథ్స్ 5, ఫిజికల్ సైన్స్ 2, బయలాజికల్ సైన్స్ 3, సోషల్ 2 కలిపి 61 స్కూల్ అసిస్టెంట్, 9 ఎస్‌జీటీ పోస్టులు కలిపి మొత్తం 70 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిని ఖాళీలు ఉన్నచోట, ప్రాధాన్యతను పరిగణలోకి తీసుకుని ఈ విద్యాసంవత్సరంలో మిగిలిన ఐదునెలలపాటు విధుల్లో ఉండేలా నియమిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.బాలాజీరావు తెలిపారు. నియమితులైన వారిలో స్కూల్ అసిస్టెంట్‌కు నెలకు రూ.12,500, ఎస్‌జీటీలకు నెలకు రూ.10వేలు పారితోషకం అందిస్తామన్నారు. జిల్లాలోని మండలాల్లో ఎక్కడ అవసరమో గుర్తించి స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తారన్నారు. వారిలో పోటీ ఉంటే మెరిట్ ఆధారంగా నియామకాలుంటాయన్నారు. ఖాళీలపై స్థానిక ఎంఈఓలు ఇప్పటికే ప్రకటనలు విడుదల చేశారని, నియామకాలు కూడా ఆయా మండలాల్లోనే చేపడతామని తెలిపారు.

'పెట్రోల్' బంద్!

● బంకుల్లో నిలిచిన విక్రయాలు

● కంపెనీల నిర్లక్ష్యంతో ట్యాంకుల్లోకి నీరు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పెట్రోలు బంకుల్లో పెట్రోలు, డీజిల్ విక్రయాలు నిలిచిపోయాయి. గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వాహకులు బంద్ నిర్వహించడంతో వాహనదారులు పెట్రోలు, డీజిల్ కోసం అవస్థలు పడ్డారు.

● నీటి కారణంగానే..

జిల్లాలో ఆరు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దాంతో రోడ్లపై ప్రవహిస్తున్న వర్షపునీరు, కాలువల్లోని మురుగు నీరు పెట్రోలు బంకుల ట్యాంకుల్లోకి చేరాయి. నీటితో కలిసిన ఇంధనం విక్రయిస్తే విమర్శలు తలెత్తుతాయని, దీన్ని వాడితే వాహనాలు మరమ్మతులకు గురవుతాయని బంకుల యజమానులు ముందు జాగ్రత్తగా ఇంధనం విక్రయాలను నిలిపివేశారు.

● నిర్లక్ష్యంతోనే ఇబ్బందులు

వర్షాకాలంలో పెట్రోలు కంపెనీల ఇంజనీర్లు బంకులను పరిశీలించి మరమ్మతులు చేయించాలి. ఈ దిశగా వారు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. అటు నిర్వాహకులు, ఇటు పెట్రో కంపెనీల ఇంజనీరు పట్టించుకోకపోవటంతో ట్యాంకుల్లో వర్షం నీరు చేరి ఇంధనంలో కలిసిపోతోంది. అయితే కొన్నిచోట్ల ఇదే ఇంధనాన్ని విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

● లక్షలాది లీటర్ల వినియోగం

జిల్లాలో 450కి పైబడి పెట్రోలు బంకులు ఉండగా, రోజుకు 3 లక్షల లీటర్ల పెట్రోలు, 4.5 లక్షల లీటర్ల డీజిల్ వినియోగం జరుగుతోంది. జిల్లాలోని పౌరసరఫరాల శాఖ అధికారులు ఈ బంకులపై నిరంతర పర్యవేక్షణ చేయాల్సి ఉన్నా.. కనీసం కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెట్రో ట్యాంకులను శుభ్రం చేయించి నాణ్యమైన ఇంధనాన్ని విక్రయించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

మున్సిపల్ స్థలానికి ఎసరు!

● రూ.కోట్లు విలువైన జాగాపై పెద్దల కన్ను

● అధికారులను బురిడీ కొట్టించే యత్నం

● నకిలీ పన్ను వేయమని అభ్యర్థన

● అనుమానంతో నిరాకరించిన యంత్రాంగం

కావలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ స్థలాలను కబ్జా చేసేందుకు కొందరు పెద్దలు పథకం రూపొందించారు. రూ.కోట్ల విలువైన మున్సిపల్ ఐడీఎస్ఎంటీ ప్లాట్లలోని ఓపెన్ ప్లేస్‌పై కొందరు బడాబాబులు కన్నేశారు. ఇందుకుగానూ 25 ఏళ్ల నాడు కావలి తహసీల్దార్‌గా పనిచేసిన ఓ అధికారి సంతకంతో మున్సిపల్ స్థలానికి నకిలీ పట్టాలు సృష్టించారు. అక్కడ సుమారు రూ.10 కోట్ల విలువైన 300 అంకణాల స్థలం ఉండగా, అందులో కొంతభాగంపై తొలుత దృష్టి పెట్టారు. స్థానికేతరులైన ముగ్గురు వ్యక్తులు ఒక్కొక్కరి పేరుతో 6 సెంట్లు (36 అంకణాల) వంతున నకిలీ పట్టాలను సృష్టించారు.



కబ్జా కోసం పెద్దలు కన్నేసిన ఐడీఎస్ఎంటీ ప్లాట్లలోని మున్సిపల్ ఓపెన్ ప్లేస్

● అధికారులను మోసం చేసే యత్నం

ఆ నకిలీ పట్టాలను మున్సిపల్ కార్యాలయానికి తీసుకువెళ్లి రెవెన్యూ విభాగంలోని ఓ ఆర్ఐని కలిశారు. వాటికి వేకెంట్ ట్యాక్స్(ఖాళీస్థలాల పన్ను) వేయమని కోరారు. డీ ఫారం పట్టాలు ఇచ్చి పన్నులు వేయమనటంతో ఆర్ఐ అందుకు సుముఖత వ్యక్తం చేశారు. అయితే ఖాళీ స్థలానికి పన్నులు వేయించుకునేవారు కొంత మొత్తాన్ని రెవెన్యూ విభాగంలో చెల్లించడం తరచూ జరుగుతోంది. ఈ నకిలీ పట్టాల వారు ఖాళీస్థలం పన్నులకు భారీ మొత్తాన్ని ఆఫర్ చేశారు. దీంతో ఆ అధికారికి అనుమానం వచ్చి ఆ స్థలం ఎక్కడదనే వివరాలు తెలుసుకున్నారు. అది మున్సిపల్ ఐడీఎస్ఎంటీ ప్లాట్లలోని ఓపెన్ ప్లేస్ అని తెలియడంతో ఆయన ఆందోళన చెందారు. ఈ స్థలానికి పన్ను వేస్తే తన ఉద్యోగం ఊడిపోతుందని భయపడి, అక్కడ నుంచి వారిని పంపించేశాడు. ఆ తర్వాత వారు కొంతమంది అధికారపార్టీ నాయకుల చేత ఒత్తిడి చేయించగా, అధికారులు భయపడి వాటికి పన్నులు వేస్తే ఉద్యోగాలు ఊడిపోతాయని చెప్పినట్లు తెలిసింది. అయితే గతంలో కూడా కొందరు ఆ స్థలాన్ని ఆక్రమించి గ్రావెల్ కూడా తోలారు. అప్పట్లో ఈ విషయమై పత్రికల్లో కథనాలు రావటంతో దాని చుట్టూ మున్సిపాలిటీ అధికారులు కంచె ఏర్పాటు చేసి, బోర్డు పెట్టారు. కొంతకాలానికి ఆ బోర్డు, కంచె మాయం కావటంతో మళ్లీ కొంతమంది కన్ను ఆ స్థలంపై పడింది.

● వారి ఆక్రమణలే వీరికి ఆదర్శం

ఐడీఎస్ఎంటీ ప్లాట్లలో ఉన్న మున్సిపల్ ఖాళీ స్థలాన్ని ఆనుకుని తూర్పువైపున ఉన్న మున్సిపల్ ఖాళీస్థలాన్ని గతంలో బుడబుక్కలోళ్లు ఆక్రమించారు. పందులు మేపుకుంటూ, అక్కడే గుడిసెలు వేసుకుని, వాటికి నకిలీ పట్టాలు కూడా తెచ్చుకున్నారు. విద్యుత్ మీటర్లు తీసుకుని చివరకు సిమెంట్ రేకులతో నిర్మాణాలు చేపట్టారు. మున్సిపల్ అధికారులు వాటిని తొలగించాలనుకునేలోపు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. వారు పట్టాలు తెచ్చుకున్న స్థలం సర్వేనంబరు ఉదయగిరి రోడ్డుకు దక్షిణం వైపున ఉన్న వెంగళరావునగర్ పరిధిలోనిది. అయితే గుడిసెలు, రేకుల ఇళ్లు నిర్మించుకున్నది మాత్రం ఉదయగిరి రోడ్డుకు ఉత్తరం వైపున ఉన్న మున్సిపల్ స్థలం. అయినా అధికారులు ఎందుకో వారిని వదిలి వేశారు. దీంతో వారిని ఆదర్శంగా తీసుకుని పక్కనే ఉన్న స్థలానికి కొందరు ఎసరు పెట్టారు.

కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు

మున్సిపల్ స్థలాలను ఎవరైనా కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. నకిలీ పట్టాలతో వేకెంట్ టాక్స్ వేయమని ఓ వ్యక్తి మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన విషయం తనకు తర్వాత తెలిసింది. అప్పుడే తన దృష్టికి తెస్తే అతనిపై క్రిమినల్ కేసు పెట్టే వాళ్లం. ఆ వ్యక్తి ఎవరో విచారించమని ఆదేశించాను.

- జీ. శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కావలి

బాల్య వివాహ రహిత జిల్లాయే లక్ష్యం

● ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : జిల్లాను బాల్య వివాహ రహితంగా చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ తెలిపారు. నెల్లూరు అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం బాల్య వివాహ రహిత భారత్ అవగాహనా కార్యక్రమం జరిగింది. పీడీ మాట్లాడుతూ బాల్య వివాహం చట్టవిరుద్ధ మన్నారు ఇది పిల్లల భవిష్యత్తును దెబ్బతీస్తుందని తెలిపారు. దీనిపై ప్రతీ గ్రామంలో, పాఠశాలలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మిషన్ వాత్సల్య కోఆర్డినేటర్ వీ అనురాధ, జిల్లా బాలల సంరక్షణ అధికారి బీ సురేష్, నెల్లూరు అర్బన్ సీడీపీవో అరుణ, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

జిల్లాలో 39వేల ఎకరాల్లో ఆక్వా సాగు

● వర్షాలకు ఎలాంటి నష్టం లేదు

● తీరప్రాంతాలకు బోటు ఏర్పాటు

● మత్స్యశాఖ జేడీ డాక్టర్ శాంతి

మనుబోలు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆక్వా, చేపల సాగు సుమారు 39వేల ఎకరాల్లో సాగవుతున్నదని జిల్లా మత్స్యశాఖ జేడీ డాక్టర్ కే. శాంతి పేర్కొన్నారు.గురువారం ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్ రమాదేవితో మాట్లాడారు. అనంతరం మీడియోతో మాట్లాడుతూ వర్షప్రభావిత ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం పెద్ద మరబోటును ఏర్పాటు చేసేందుకు మత్స్యశాఖ ప్రయత్నిస్తున్నదన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఎక్కడా ఆక్వాసాగుకు వరదల వల్ల నష్టం లేదన్నారు. చాలా గుంతలు అన్‌రిజిష్టర్‌లో ఉన్నాయన్నారు. ఇంకా 12వేల ఎకరాలు రిజిష్టర్ కావాల్సి ఉందన్నారు. రిజిష్టర్ చేసుకోకపోతే ఆక్వారైతులు రాయితీని కోల్పోతారన్నారు. వరద తగ్గేవరకు బోటు అందుబాటులో ఉంచి, ప్రజలకు సౌకర్యాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ చాన్‌బాషా, డీటీ ప్రదీప్, ఆర్ఐ తదిరతులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ శాంతి

కలువాయిని నెల్లూరులోనే కొనసాగించాలి

కలువాయి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కలువాయి మండలాన్ని ఆత్మకూరు రెవెన్యూ డివిజన్, నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని గురువారం సమగ్ర శిక్ష ఎంప్లాయిస్ ఫెడరేషన్ (జేఏసీ) కలువాయి తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. తిరుపతి జిల్లాలోకి తీసుకెళితే ప్రజలు ఇబ్బంది పడతారని, ప్రభుత్వం పునరాలోచన చేసి న్యాయం చేయాలని వారు కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 12238
వెండి కిలో ధర	రూ. 179800
వెండి ఒక గ్రాము	రూ. 184.80

ఏపీ ఎన్జీవోల సంఘం ఎన్నిక ఏకగ్రీవం



ఏకగ్రీంగా ఎన్నికైన ఏపీ ఎన్జీవోల సంఘం ఆత్మకూరు తాలూకా యూనిట్ కార్యవర్గ సభ్యులు

ఆత్మకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఆత్మకూరు తాలూకా యూనిట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం ఆత్మకూరు పీడబ్ల్యూడీ కాంపౌండ్‌లో సోమశిల ప్రాజెక్ట్ డివిజన్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించారు. అనంతరం ఒక్కో పోస్టుకు ఒక్కో అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి ఏవి కృష్ణకుమార్ ప్రకటించారు. ఆత్మకూరు తాలూకా యూనిట్ అధ్యక్షులుగా బి శైలజ, సహాధ్యక్షులుగా షేక్ ముజీబ్ అహ్మద్, ఉపాధ్యక్షులుగా కె భాస్కర్‌రెడ్డి, కె రఘురామ్, కె ఉత్తయ్య, కార్యదర్శిగా ఆర్ వెంకటసుబ్బయ్య, సంయుక్త కార్యదర్శులుగా ఎం ప్రతాప్‌కుమార్, కె నిరంజన్, షేక్ షఫీ, హైమావతి, కోశాధికారిగా బి సుప్రియ ఎన్నికయ్యారు.

సీఆర్ఎంటీల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న సీఆర్ఎంటీలు

కలువాయి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ సీఆర్ఎం టీచర్స్ యునైటెడ్ ఫోరం పిలుపు మేరకు గురువారం కలువాయి మండల క్లస్టర్ రిసోర్సు మొబైల్ టీచర్లు (సీఆర్ఎంటీ)లు తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. క్లస్టర్ విధానం రద్దు చేయాలి, ఎంటీఎస్ ఇప్పించాలి, వేతనాలు పెంచాలి, అర్హత కల్గిన వారికి డీఎస్సీలో వెయిటేజ్ ఇవ్వాలి, ఉద్యోగ విరమణ వయస్సు 62 చేయాలి, చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఆర్ఎం రాష్ట్ర కన్వీనర్ టి నాగేశ్వరావు, సీఆర్ఎంటీలు శ్రీహరి, మహేష్, వెంకటేశ్వర్లు, పెంచలయ్య, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉచిత పశు వైద్యశిబిరాలు



పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న పశు వైద్యాధికారి రాఘవేంద్ర శర్మ

ఉదయగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల బీఎస్సీ చివరి సంవత్సరం విద్యార్థులు మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్ గ్రామాల్లో జాతీయ సేవా పథకం సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం పశు వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈసందర్భంగా పశు వైద్యులు రాఘవేంద్రశర్మ, క్రాంతికుమారిలు పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గడ్డిజాతి రకాలు, వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు వ్యవసాయ ప్రదర్శన, రైతు సదస్సు నిర్వహించారు. త్వరలో ఆయా గ్రామాలను దత్తత తీసుకొని సేవా, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ కృష్ణారెడ్డి, ఆచార్యులు గోపికృష్ణ, దుర్గాప్రసాద్, కిషన్‌తేజ్, సునీత, శోభరాణి, మాధవి, రాజేశ్వరి, సందీప్, ఏవో విజయభాస్కర్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు సునీత, వెంకటేశ్వర్లు, గ్రామస్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సిబ్బంది పనితీరుపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సీతారామపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించే వైద్య సిబ్బంది పనితీరుపై గురువారం జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి డా. షేక్ ఖాదర్ వలీ విచారణ చేపట్టారు. గత నెల 17వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది అందుబాటులో లేక గుండెపోటుతో ఒకరి మృతి అనే శీర్షికన వార్తా కథనం వెలువడిన సంగతి తెలిసిందే. అందుకు స్పందించిన వైద్యశాఖ ఉన్నతాధికార యంత్రాంగం వైద్యాధికారిణిని డిప్యూటేషన్‌పై బదిలీచేసి విచారణ అధికారిగా ఖాదర్‌వలీని నియమించి గురువారం పీహెచ్‌సీకి పంపించారు. ఆయన వైద్య సిబ్బందిని విచారించి వారి వద్ద నుంచి సమగ్ర వివరాలు రాబట్టి లిఖితపూర్వకంగా సమాచారాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాడు జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేశామని, తుది నివేదికను వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

వర్షాలతో రహదారులు ఛిద్రం

● ప్రజలు, వాహనదారుల అవస్థలు



గుంతలమయంగా గండిపాళెం రహదారి

ఉదయగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రహదారులు ఛిద్రమయ్యాయి. ప్రధానంగా ఉదయగిరి-గండిపాళెం మార్గం రహదారి మోకాటిలోతు గుంతల్లో వర్షపు నీరు చేరి ప్రమాదకరంగా మారింది. కంకరతేలి గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. అలాగే ఉదయగిరి పట్టణంలోని కెనరా బ్యాంకు వెళ్లే రహదారి బురదమయంగా మారడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వర్షాలతో నీట మునిగిన పంట పొలాలు



ఆత్మకూరు సమీపంలో నీట మునిగిన వరినాట్లు



చేజర్ల: గొల్లపల్లి సమీపంలో నీట మునిగిన నారుమడులు

ఆత్మకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను ప్రభావంతో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆత్మకూరు ప్రాంతంలో పలుచోట్ల చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. ఆత్మకూరు, వాశిలి తదితర చెరువులు అలుగులు పారుతున్నాయి. పంట పొలాలు నీట మునిగాయి. ఆత్మకూరు, వెంకట్రావుపల్లి, నరసాపురం గ్రామాలకు చెందిన సుమారు 400 ఎకరాల్లో వరి నారుమళ్లు, వరినాట్లు నీటమునిగాయి. పంట పొలాలు చెరువును తలపిస్తున్నాయి. పేరారెడ్డిపల్లిలో మొక్కజొన్న పంట 170 ఎకరాలు, 70 ఎకరాల్లో శనగపంట నీట మునిగాయి. అధికారులు పంట నష్టం అంచనా వేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

●కలువాయి: దిత్వా తుఫాను ప్రభావంతో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కలువాయి చెరువు కలుజు పారి నారుమడులు నీటమునిగాయి. సుమారు 200 ఎకరాల్లో నారుమడులు నీటిలో మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కలుజునీరు కలువాయి, వెంకటరెడ్డిపల్లి పొలాలను ముంచెత్తింది. వెంకటరెడ్డిపల్లి వద్ద కలుజు నీరు సోమశిల-పొదలకూరు రోడ్డుపై ప్రవహిస్తోంది.

●చేజర్ల: దిత్వా తుఫాన్ ప్రభావంతో గత నాలుగు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు మండలంలో చేజర్ల, మడపల్లి, యనమదల, కాకివాయి, మూముదూరు, పెళ్ళేరు, ఏటూరు, పాతపాడు తదితర గ్రామాలలో సుమారు 200 హెక్టార్లలో నారుమళ్ళు, చిత్తలూరు, నెర్నూరు తదితర గ్రామాలలో సుమారు 40 హెక్టార్లలో మినుము పంట పూర్తిగా నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం చేకూర్చింది. మండల వ్యవసాయ శాఖ అధికారి హిమబిందు పలు గ్రామాలలో నీట మునిగిన నారుమళ్లు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు.

శబరిమలకు తరలిన అయ్యప్ప భక్తులు



అయ్యప్ప భక్తులకు ఇరుముడులు కడుతున్న గురుస్వాములు

సీతారామపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన 30 మంది అయ్యప్ప స్వామి భక్తులు గురువారం శబరిమలకు తరలివెళ్లారు. గురువారం వేకువజాము నుంచి స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఇరుముడులు ధరించారు. అనంతరం ర్యాలీగా స్థానిక బస్టాండ్ సెంటర్ వద్దకు చేరుకొని, ప్రైవేటు బస్సుల్లో శబరిమలకు తరలి వెళ్లారు.

నేడు గంధ మహోత్సవం



గంధ మహోత్సవానికి ముస్తాబైన దర్గా

ఉదయగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న హజరత్ సయ్యదిన దుర్వేషావలి ఔలియా వారి గంధమహోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దర్గా నుంచి గంధం మేళతాళాలు, ఫకీరు జరుబులు, బాణసంచా పేలుళ్ల నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగింపు చేపట్టి అనంతరం దర్గా చేర్చి ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు పంచిపెట్టడం జరుగుతుందన్నారు. . భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని, కావున హిందూ, ముస్లిం భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

మర్రిపాడులో వర్షం

మర్రిపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ కారణంగా మర్రిపాడు మండలంలో బుధవారం రాత్రి నుండి ఉదయం వరకు ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో చెరువులు కుంటలు నిండుకుండలా మారాయి. గ్రామాల్లో దారులన్నీ బురదతో రొచ్చురొచ్చుగా మారాయి.

పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం

● రాష్ట్ర మంత్రి ఆనం



లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఆత్మకూరు మున్సిపాల్టీలో రూ. 6.27 కోట్ల సబ్సిడీతో మంజూరైన 251 ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం(పీఎంఏవై) ద్వారా నెల్లూరు జిల్లాకు రూ. 70.95 కోట్లతో 2838 ఇళ్లు మంజూరవడం హర్షదాయకమన్నారు. నగర, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 2.5 లక్షలు మంజూరు చేస్తారన్నారు. అందులో కేంద్ర ప్రభుత్వం వాటా రూ1.50 లక్షలు కాగా, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. లక్ష రూపాయలు వంతున లబ్ధిదారులకు అందజేయబడుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఇళ్లు మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోడికి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇళ్లు మంజూరైన పేద, మధ్య తరగతి కుటుంబాలు ఎన్డీఏ ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

చేజర్ల మండలంలో నేడు మంత్రి ఆనం పర్యటన

చేజర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చేజర్ల మండలంలో శుక్రవారం రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటించనున్నట్లు చేజర్ల మండల టిడిపి అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్ తెలిపారు. మండల కేంద్రమైన చేజర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, కావున ఈ కార్యక్రమానికి మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

టీడీపీ అభ్యున్నతికి సమష్టిగా పనిచేద్దాం

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



గ్రామ కమిటీల ఎంపిక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యున్నతికి సమష్టిగా పనిచేద్దామని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని జీ.చెరువుపల్లి, జీ.చెర్లోపల్లి, జీ.అయ్యవారిపల్లి, పుల్లాయపల్లి పంచాయతీల్లో టీడీపీ గ్రామ కమిటీ ఎంపిక సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పార్టీలో విబేధాలకు తావులేకుండా గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. గత ప్రభుత్వ పాలన, ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రాభివృద్ధి, రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారన్నారు. అనంతరం గత ఎన్నికల్లో పార్టీ విజయానికి నిస్వార్థంగా పనిచేసిన బూత్ ఏజెంట్లు, పార్టీ నాయకులతోపాటు సభ్యత్వ నమోదులో ప్రతిభ చూపిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీల్లో ప్రజలు పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయా పంచాయతీల్లో గ్రామ కమిటీ అధ్యక్షుడు, సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, మన్నేటి వెంకటరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, సొసైటీ అధ్యక్షుడు గడ్డం వెంకటసామయ్య, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, బొజ్జా శ్రీనివాసులు, నల్లిపోగు నరసింహ, అనంతశెట్టి ఏడుకొండలు, మతకాల శ్రీనివాసులు, వెంకటయ్య, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో పొంగిపొర్లిన వాగులు, వంకలు



అనంతసాగరం -ముత్తుకూరు వంకను పరిశీలిస్తున్న తహసీల్దారు



ఏఎస్‌పేట:కొండమీద కొండూరు మార్గంలో వాగును పరిశీలిస్తున్న ఎంపీడీవో



సంగం: దువ్వూరు చెరువు కలుజుపై పారుతున్న వరద ప్రవాహం

అనంతసాగరం డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేతమన్నేరు, కొమ్మలేరు, రామరావు వంకలు వర్షంతో పొంగిపొర్లుతున్నాయి. దీంతో ముత్తుకూరు, కమ్మవారిపల్లి వద్ద రాకపోకలు స్తంభించాయి. కమ్మవారిపల్లి వద్ద నీటిప్రవాహంలో అతికష్టం మీద వంకను దాటుతూ పీకేపాడుకు చెందిన ఒక ఉపాధ్యాయుడు నీటి ప్రవాహంలో జారడంతో బైక్ నీటిలో పడింది. అక్కడ ఉన్నవారు గమనించి ప్రమాదం నుంచి కాపాడారు. ఈ రెండు వాగులను తహసీల్దారు జయవర్ధన్‌రెడ్డి తన సిబ్బందితో పరిశీలించి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు. వాగులోకి ప్రజలు దిగకుండా రెండు వైపులా కంప వేయించి సిబ్బందిని కాపలా ఉంచారు.

జలదిగ్బంధంలో కొండమీద కొండూరు

ఏఎస్ పేట: మండలంలోని కొండమీద కొండూరు గ్రామం గురువారం జలదిగ్బంధంలో చిక్కుకుంది. గ్రామంలోకి ఆత్మకూరు-సంగం బైపాస్ నుండి వెళ్లాలి. చుట్టూ కొండ ఉండడంతో గ్రామంలోకి వెళ్లాడానికి ఒకే మార్గం ఉంది. ఈ మార్గంలో బీరాపేరు వాగు ఉంది. వర్షాల కారణంగా వాగు పొంగి రోడ్డు మీదుగా ప్రవహిస్తుండడంతో ముందు జాగ్రత్త చర్యగా ఎంపీడీవో ప్రసన్నకుమారి వాగును పరిశీలించి గ్రామంలోకి రాకపోకలను నిలిపివేశారు. అదేవిధంగా ఏఎస్ పేట నుండి గుడిపాడు గ్రామానికి వెళ్లే మార్గంలోని బీరాపేరు వాగు సైతం ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఏఎస్‌పేట నుండి గుడిపాడు గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.

సంగం: మండలంలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ప్రవహించి దువ్వూరు చెరువు కలుజు గురువారం స్వల్పంగా ప్రవహించింది. ఇటీవల ముంథా తుపాన్‌తో ఈ కలుజుపై భారీగా నీరు ప్రవహించింది. వర్షాలు తగ్గడంతో కలుజు ఆగిపోయింది. దిత్వా తుఫాన్‌తో మళ్లీ వర్షాలు కురవడంతో మళ్లీ కలుజు స్వల్పంగా పారింది. రాత్రికి ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు.

చేజర్ల : నాలుగు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు మండలంలో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. టికే పాడు సమీపంలోని నల్లవాగు పొంగి ప్రవహిస్తుండడంతో మండల కేంద్రమైన చేజర్ల నుండి టి.కే.పాడు, కోటితీర్థం, యనమదల, కాకివాయి తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అదే విధంగా గొల్లపల్లి సమీపంలో పందలవాగు ప్రవహిస్తుండడంతో చేజర్ల నుండి సంగం వైపు వెళ్ళే గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగుల వద్ద ప్రజలు దాటకుండా ఉండేలా ఆర్‌అండ్‌బి సిబ్బందితో పాటు పోలీసులను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తిరుమలరావు తెలిపారు. ఏటూరు గ్రామంలో పెద చెరువు అలుగు ఉధృతికి గ్రామంలో ఉన్న రహదారిపై ఉండే కల్వర్టుతో పాటు పైన ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతింది. మండలంలో ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నట్లు తహసీల్దారు మస్తానయ్య తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

పెంచలయ్య హత్య కేసులో..

మరో ఆరుగురి అరెస్ట్

● 17కు చేరిన నిందితుల సంఖ్య

నెల్లూరు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో ఇటీవల సీపీఎం నాయకుడు పెంచలయ్యను హత్య చేసిన గంజాయి ముఠాకు చెందిన మరో ఆరుగురు నిందితులను నెల్లూరు రూరల్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. తొలుత ఈ నేరంతో 14 మందికి సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించగా లోతైన దర్యాప్తు జరపడంతో మరో ముగ్గురికి కూడా సంబంధం ఉన్నట్లు తేలిందని తెలిపారు. దీంతో నిందితుల సంఖ్య 17కు చేరింది. వారిలో ఏడుగురిని ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. తాజాగా మరో ఆరుగుని అరెస్టు చేశారు. ప్రధాన సూత్రధారి అరవ కామాక్షిని గంజాయి కేసులో నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. మరో నిందితుడు జేమ్స్ పోలీసులపై తిరబడి వారు జరిపిన కాల్పుల్లో గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఇంకో ఇద్దరు నిందితులను పట్టుకోవాల్సి ఉంది.

వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

● ఒట్లూరులో విషాదం



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కావలి రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారుడు పొన్నాడి ఏడుకొండలు(57) ప్రమాదశాత్తు నీటమునిగి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం కావలి మండలం ఒట్టూరు తీరంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు, ఒట్టూరుకి చెందిన ఏడుకొండలుకి నలుగురు కుమార్తెలు. రెక్కాడితేకానీ డొక్కాడని నిరుపేద కుటుంబం. ఈ క్రమంలో నిత్యం సముద్రతీరానికి 20 అడుగుల దూరంలో కర్రలు కట్టి వలవేసి చిక్కిన చేపలతో జీవనం సాగిస్తుంటాడు. ఎప్పటిలాగే గురువారం మధ్యాహ్నం 2గంటలకు వలవేసి రావటానికి వెళ్లాడు. కర్రకు వల వేస్తుండగా కాలు చిక్కుకుంది. ఆ సమయం లో అక్కడ ఎవరూ లేకపోవటంతో నీటమునిగి మృతి చెందాడు. కొంతసేపటికి తీరం వద్దకు వచ్చిన మత్స్యకారులు తీరానికి సమీపంలో వలలో చిక్కుకుని నీళ్లలో తేలుతున్న ఏడుకొండలు మృతదేహాన్ని చూసి, ఒడ్డుకు చేర్చి పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి రూరల్ ఎస్ఐ తిరుమలరెడ్డి, పంచాయతీ అభివృద్ధి అధికారి అబ్దుల్ సమద్, వీఆర్వో రమణయ్య చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఏడుకొండలు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్‌పై రెండోసారి పీడీ యాక్ట్

నెల్లూరు(క్రైం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఓ రౌడీషీటర్‌పై వేదాయపాళెం పోలీసులు రెండవ సారి పీడీ యాక్ట్‌ను ప్రయోగించారు. వేదాయపాలెం రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతానికి చెందిన దేవళ్ల జయప్రకాష్ అలియాస్ గూడూరు జయపై వేదాయపాలెం స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. ఆయనపై 14 కేసులున్నాయి. 2022 మేలో పోలీసు అధికారులు ఆయనపై పీడీ యాక్ట్ ప్రయోగించి కడప కేంద్ర కారాగారానికి పంపారు. కొంతకాలం జైలులో ఉండి బయటకు వచ్చాడు. అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడం, నేరాలకు పాల్పడుతూనే ఉండటంతో గురువారం మరోమారు పీడీ యాక్ట్ ప్రయోగించినట్లు వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ కే శ్రీనివాసరావు తెలిపారు.

ఫోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

దుత్తలూరు(ఉదయగిరి), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫోక్సో కేసులో నిందితుడైన యువకుడిని అరెస్టు చేసి ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి అంజయ్య రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ఆదిలక్ష్మీ గురువారం తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని గతనెల 19వ తేదీ నుంచి కనిపించడంలేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదులో భాగంగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతుండగా అదే గ్రామానికి చెందిన యువకుడు వెంగబాబు తీసుకెళ్లాడని రుజువు కావడంతో అతనిపై ఫోక్సో కేసు నమోదు చేశామన్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఆ యువకుడిని అరెస్టు చేసి ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి 14 రోజులపాటు రిమాండ్ విధించడంతో జైలుకు తరలించినట్లు ఆమె తెలిపారు.

మరో కేసులో..

ఉదయగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లాయపల్లి ఎస్సీ కాలనీ సమీపాన గల అటవీ ప్రాంతంలో వదిన, మరదలిపై గొడ్డలితో దాడి చేసిన బొబ్బా ఆదినారాయణకు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి గురువారం తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి అంజయ్య ఈనెల 17వ తేదీ వరకు రిమాండ్ విధించగా జైలుకు తరలించామన్నారు.

పాముకాటుతో యువకుడి మృతి



మృతిచెందిన అరవింద్

జలదంకి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపాలెంలో బుధవారం అర్థరాత్రి పాముకాటుతో బొబ్బాల అరవింద్(26) మృతిచెందాడు. పొలం పనులకు వెళ్లిన అరవింద్ పొలంలో పని చేస్తుండగా పాముకాటేయడంతో వెంటనే చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స చేస్తుండగానే మృతిచెందాడు. చేతికొచ్చిన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. గురువారం ఉదయం విషయం తెలుసుకున్న గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.

మృతదేహం ఆచూకీ లభ్యం

ఉదయగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్ జిల్లా సగన్వ గ్రామానికి చెందిన సౌరభ్‌కుమార్ మృతదేహం గురువారం లభ్యమైంది. ఎస్ఐ అల శ్రీను ఆధ్వర్యంలో మత్స్యకారులు జలాశయం నీటిలో మూడు రోజులుగా గాలింపు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సేవ్ రాపూరు, కలువాయి!

(5వ పేజీ తరువాయి)

జరిగితే రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు ఎన్నో రకాల సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకు గట్టి ప్రయత్నం చేయాలని నాయకులంతా నిర్ణయించుకున్నారు. అవసరమైతే పార్టీలకు అతీతంగా పోరాడుదామని నిర్ణయించుకున్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, జిల్లా మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణల ద్వారా ప్రభుత్వ పెద్దలను ఒప్పించి సాధించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం బస్టాండు వరకు టీడీపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. తిరుపతి వద్దు.. నెల్లూరు ముద్దు అంటూ నినాదాలు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	139
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	274

కోడిగుడ్ల ధర (100): 670

అల్లూరులో మోస్తరు వర్షం

అల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంగ మండలంలో గురువారం మోస్తరు వర్షం కురిసింది. అనుకున్న మేర వర్షపాతం లేకున్నా ఎగువ నుంచి వస్తున్న వరద నీరు పైడేరు ద్వారా అల్లూరు చెరువుకు చేరుకోవడంతో కలుజు పారుతున్నది. పైడేరు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో బీరంగుంట సమీపంలో కట్ట తెగి నీరు పొలాల్లోకి ప్రవహిస్తోంది. దీంతో రైతులు నాట్లు వేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు.



పాఠశాలకు కుర్చీల వితరణ



దాత అందజేసిన కుర్చీలను అందుకుంటున్న హెచ్‌ఎం గంగాధర్‌రావు

బిట్రగుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు పాతబిట్రగుంటకు చెందిన ఎస్వీపీఎం కెనాల్-2 అధ్యక్షుడు యన్నాబత్తిన రమణయ్య ఐదు కుర్చీలను గురువారం వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం గంగాధర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిని ఆశిస్తూ దాతలు ముందుకు రావడం అభినందనియమన్నారు. ఈ కార్యక్రమంలో సహోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బిట్రగుంటను వీడని చలిగాలులు

బిట్రగుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో తుఫాన్ ప్రభావం వీడలేదు. గురువారం చలిగాలులు వీస్తు చిరుజల్లులు కురిశాయి. తుఫాన్ తీరం దాటి నప్పటికీ చలితీవ్రత తగ్గలేదు. కురిసిన వర్షాలకు బోగోలు, కడనూతల, కోవూరుపల్లి, జక్కేపల్లి గూడూరు చెరువులు కలుజులు పారుతున్నాయి.

నేడు దగదర్తిలో మెగా పీటీఎం

దగదర్తి (బిట్రగుంట) డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలంలోని అన్నీ పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించనున్నట్లు ఎంఈవో ఎం. భాస్కర్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో జరిగే పేరెంట్స్ మీటింగ్‌కు ఉపాధ్యాయులు, విద్యాకమిటీ ఛైర్మను, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పాలనా సౌలభ్యం కోసమే డీడీవో కార్యాలయాలు



డీడీవో కార్యాలయ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి, ఆర్డీవో తదితరులు

కావలి,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): పరిపాలనా సౌలభ్యం కోసమే డీసీఎం పవన్ కల్యాణ్ డీడీవో కార్యాలయాలను ప్రారంభించి, పంచాయతీరాజ్ వ్యవస్థలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న భవనంలో ఏర్పాటు చేసిన డీడీవో కార్యాలయాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఒకే భవన సముదాయంలో డీడీవో కార్యాలయం, డీఎల్‌పీవో, డ్వామా ఏపీడీ కార్యాలయాలను కూడా ఆయన ప్రారంభించారు. అంతకు ముందు డీసీఎం పవన్‌కల్యాన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డీడీవో కార్యాలయాల వల్ల ప్రజలు మండల పరిధిలో కాని పనులకు ఇక్కడ చేసుకోవచ్చన్నారు. కావలి డీడీవో కార్యాలయ భవనం కోసం 50 సెంట్ల స్థలం కేటాయించామని, రూ.2.5 కోట్ల నిధులు కూడా మంజూరు చేసామన్నారు. త్వరలో భవన నిర్మాణం చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణ, డీడీవో విజయకుమార్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో శ్రీదేవి, పలువురు అధికారులు, టీడీపీ నాయకలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చొరవతో పాఠశాలల అభివృద్ధి



పాఠశాల కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న బీద గిరిధర్

అల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర చొరవతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు శ్రీకారం చుట్టామని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. మండలంలోని ఉన్నత పాఠశాలలను స్థానిక నాయకులతో కలసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసించేందుకు దూరప్రాంతం నుంచి వచ్చే విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ల్యాబ్, ఆటస్థలం, మరుగుదొడ్ల నిర్మాణం విషయమై యాజమాన్యం ఆయన దృష్టికి తీసుకువచ్చింది. పరిశీలించి చర్యలు చేపడతామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండి శ్రీనివాసులు రెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, మేడ కృష్ణారెడ్డి, మేడ శ్రీనివాసులు రెడ్డి, కావలి జగన్‌మోహన్, ఎంఈవో రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వంటేరు జన్మదిన వేడుకలు

జలదంకి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): కావలి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత వంటేరు వేణుగోపాల్‌రెడ్డి 76వ జన్మదిన వేడుకలను గురువారం స్వగ్రామం బ్రాహ్మణక్రాక, బీకే అగ్రహారంలోని వరదారెడ్డి గిరిజనకాలనీలో ఆయన అభిమానులు జరుపుకున్నారు. బ్రాహ్మనక్రాకలోని వంటేరు కార్యాలయంలో సర్పంచి ఇండ్ల సుధాకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అబిమానులకు పంచిపెట్టారు. వరదారెడ్డికాలనీలో వంటేరు అభిమాని బండి సంజీవయ్య ఆధ్వర్యంలో రామాలయం ప్రాంగణంలో బారీకేక్‌ను కట్ చేసి కాలనీ ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సర్పంచి సుదాకర్ మాట్లాడుతూ బ్రాహ్మణక్రాక పంచాయతీ అభివృద్ధి ప్రదాత వంటేరు అని కొనియాడారు. ఆయన సేవలు మరువలేనివని పేర్కొన్నారు.

ఎస్ఐఆర్ మ్యాపింగ్ వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ తదితరులు

కావలి,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి) అర్బన్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) మ్యాపింగ్‌ను వేగవంతం చేయాలని ఆర్డీవో, కావలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం. సన్నీ వంశీక్రిష్ణ తెలిపారు. ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం కావలి అర్బన్‌లోని ఏఈఆర్వో, సూపర్‌వైజర్లు, బీఎల్వోలతో ఆయన ఓటరు మ్యాపింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ప్రతి ఇంటిని సర్వే చేసి 2002లో ఓటర్‌లిస్ట్‌లో ఉన్న వారు 2025లో ఉన్న ఓటర్ లిస్ట్‌లో ఉన్నారా, ప్రస్తుతం 40ఏళ్ల పై బడిన వారు 2002 ఓటర్‌లిస్ట్‌లో ఉన్నారా, లేకపోతే ఇప్పుడు ఎలా వచ్చారు అనేదానిపై వివరాలు సేకరించాలన్నారు. ఇప్పుడు అదనంగా ఉన్న ఓటర్లు వారి కుటుంబంలో పిల్లలేనా వాటిపై జరుగుతున్న మ్యాపింగ్ సర్వేను వేగవంతం చేయాలని ఆర్డీవో కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ పాల్గొని మ్యాపింగ్‌పై పలు సూచనలు చేశారు.

రహదారి భద్రతపై సదస్సు



సదస్సులో పాల్గొన్న ఎంవీఐ సుందరరావు, ఏఎంవీఐ లక్ష్మీభాయి

కావలి (టౌన్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధుకర్ పర్యవేక్షణలో ప్రొఫెసర్ ప్రతాప్‌సింగ్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ముఖ్య అతిథులుగా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందరరావు, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాయిలు పాల్గొన్నారు. విట్స్ ఛైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి సదస్సు నిర్వాహకులను, అధికారులను అభినందించారు.

వేతనాలు పెంచాలని సీఆర్‌పీల వినతి



తహసీల్దారు కార్యాలయ ఉద్యోగికి వినతిపత్రం అందజేస్తున్న సీఆర్‌పీలు

జలదంకి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంచాలని మండల విద్యావనరుల కేంద్రంలో పనిచేస్తున్న క్లస్టర్ రిజర్వు టీచర్స్(సీఆర్‌పీ)లు గురువారం తహసీల్దారు కార్యాలయంలోనూ, విద్యావనరుల కేంద్రంలోనూ వినతిపత్రాలు అందజేశారు. అనంతరం సీఆర్‌పీలు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల తమ జీతభత్యాలు పెంచలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 మాసాలు అయినా, మా జీతభత్యాల విషయంలో ఎలాంటి ముందడుగు వేయలేదని పేర్కొన్నారు. తమ వేతన పెంపు డిమాండ్ల సాధనలో భాగంగా తహసీల్దారు, ఎంఈవోలకు వినతిపత్రాలు అందజేశామన్నారు. ఈనెల 8న కలెక్టరేట్‌ల వద్ద, 22న విజయవాడలో ఆత్మగౌరవదీక్ష చేయనున్నామని సీఆర్‌పీల డీ. కొండయ్య, ఏ.మాధవ, డీ.శ్రీనివాసులు, పీ.రవిచంద్ర, పీ.శ్యామల పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు.

వృథాగా పోతున్న తాగు నీరు

లింగసముద్రం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాపురంలోని రక్షిత మంచి నీటి ట్యాంకుకు చెందిన రెండు పైపులు పగిలిపోయాయి.దీంతో నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా పాత చెరువు కట్ట మట్టి రోడ్డు



వర్షాలకు అధ్వానంగా ఉన్న లింగసముద్రం పాత చెరువు కట్ట మట్టి రోడ్డు

లింగసముద్రం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను ప్రభావంతో గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు లింగసముద్రం పాత చెరువు కట్ట మట్టిరోడ్డు అధ్వానంగా మారింది. ఈ వర్షాలకు 3 కి.మీ పొడవున ఉన్న ఈ రోడ్డు బురదమయమై గుంతలతో నిండి దారుణంగా తయారైంది. దీంతో వాహనదారులు, పాదచారులు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే నానా అవస్థలు పడుతున్నారు. అలాగే మండలంలోని వీఆర్, విశ్వనాధపురం, మాలకొండరాయునిపాలెం, ముక్తేశ్వరం, గంగపాలెం, తిమ్మారెడ్డిపాలెం గ్రామాల ప్రజలు లింగసముద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు, నిత్యావసరాల సరుకుల కోసం రావాలన్నా తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అంతేగాక వర్షాలకు చెరువు కట్ట పలుచోట్ల కోసుకుపోయి గుంతలు పడింది. వీటిని గమనించకపోతే వాహనదారులు ఈ గోతులలో పడి గాయాలపాలు కాక తప్పదు. ఈ విషయమై మండల మైనర్ ఇరిగేషన్ ఏఈ బి మనోహర్‌ను వివరణ కోరగా.. రెండు నెలల క్రితం చెరువు కట్ట అభివృద్ధికి, ఇతర పనుల కోసం రూ.3.05 కోట్లతో సెంట్రల్ వాటర్ కమిషన్‌కు ప్రతిపాదనలు పంపించామని, ఈ నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

వైభవంగా సత్యనారాయణ వ్రతం



కందుకూరు: సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

కందుకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్దబజారులో ఉన్న కోదండ రామాలయంలో గురువారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. ఆలయ పూజారులు స్వామివారిని అలంకరించి వ్రతం నిర్వహించగా భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసా దాలు అందించటంతో పాటు అన్నప్రసాదాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ మురారిశెట్టి వెంకటసుబ్బారావు, మురారిశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● ఉలవపాడు : కరేడు గ్రామంలో ఉన్న శ్రీకృష్ణ దేవాలయంలో గురువారం వీర వెంకట సత్యనారాయణస్వామి సామూహిక వ్రతం నిర్వహించారు. ఆలయ పూజారి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పూజ అనంతరం వ్రతంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్న వితరణ నిర్వహించారు.

10వ తరగతి విద్యార్థులకు టెస్ట్ పేపర్ల పంపిణీ



విద్యార్థులకు టెస్ట్ పేపర్స్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం మాధవరావు, దాత ప్రభాకర్ తదితరులు

లింగసముద్రం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపవని, లింగసముద్రంలోని జడ్పీ హైస్కూళ్లలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థులు టెస్ట్ పేపర్స్ పంపిణీ చేశారు. గురువారం లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి, ఇంగ్లీషు ఉపాధ్యాయుడు కల్లూరి ప్రభాకర్ హైస్కూల్‌లోని 90 మందికి అందజేశారు. అలాగే పెదపవని భోళేరావు జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి రామిశెట్టి రంగారావు 75 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు, లింగసముద్రం, పెదపవని హైస్కూళ్ల హెచ్‌ఎంలు యు మాధవరావు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పివిఆర్ మధుసూదనరావు, యూటీఎఫ్ నాయకులు ఎంఎం సుధాకర్‌రావు, టి సుధాకర్‌రావు, యు రవిబాబు, బి శారద, ఎస్ శాంతకుమారి, రంగవల్లి, శ్రీనివాసులు, ఇమామ్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ అధికారిగా రాంబాబు

వలేటివారిపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం మండలం గ్రామ సచివాలయం అధికారిగా బి రాంబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రకాశం జిల్లా జె. పంగులూరు గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతిపై వలేటివారిపాలెం మండలం గ్రామ సచివాలయం అధికారిగా బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీఓ శంకరరావు తెలిపారు.

పంచాయతీ నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలి

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



డీడీఓ కార్యాలయాన్ని ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీ నిధుల వినియోగంలో పారదర్శకత పాటించడంతో పాటు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిధులు వెచ్చించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. పట్టణంలోని విప్పగుంట రోడ్డులో నూతనంగా నిర్మించిన డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీఓ) కార్యాలయాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రసంగాన్ని అధికారులతో కలిసి వీక్షించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు ఇతర సమస్యల పరిష్కారానికి డీడీఓ కార్యాలయం అనుసంధానంగా పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీడీఓ రాంబాబు, డీఎల్‌పీఓ కృష్ణమోహన్, ఇంచార్జి ఏపీడీ బాబూరావు, డివిజన్‌లోని వివిధ మండలాల ఎంపీడీఓలు రత్నకుమారి, కట్టా శ్రీనివాసరావు, శంకరరావు, సురేష్, శ్రీనివాసరావు, ఆదినారాయణ, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ రమేష్, పీఆర్ డీఈఈ చంద్రమౌళి, ఎంపీపీ ఇంటూరి సుశీల, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, గంగవరపు బ్రహ్మయ్య, మన్నం శ్రీనివాసరావు, కామినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

సీఎం రిలీఫ్ ఫండ్‌కు భారీగా నిధులు కేటాయించటం ద్వారా పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 64మందికి మంజూరైన 45 లక్షల రూపాయల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ఎల్‌ఓసీలను గురువారం సాయంత్రం ఎమ్మెల్యే చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పూరిమెట్ల గురునాథం, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, చదలవాడ కొండయ్య, ఎన్వీ రమణయ్య, రావుల రవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటూరికి సన్మానం

కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయం ఆదాయం పెంచటమే లక్ష్యంగా షాపుల నిర్మాణంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కృషి ఎనలేనిదని ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావు, మంచిరాజు మురళీమోహన్, ఈఓ కార్తీక్‌లు అభినందించారు. అంకమ్మ దేవాలయం ప్రాంగణంలో ఇప్పటికే పూర్తయిన 18 షాపు రూముల మొదటి నెల అద్దె రూ. 2.035 లక్షలు జమ అయిన సందర్భంగా గురువారం వారు ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంకమ్మ ఆలయాన్ని పునర్నిర్మాణం చేసుకోవడంతో పాటు ప్రస్తుతం అనివేటి మండపం నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయన్నారు.

రేపు ఆలయ భూముల కౌలుకు బహిరంగ వేలం

కందుకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాలెం కోదండరామాలయానికి సంబంధించి మండలంలోని కోవూరు గ్రామంలో ఉన్న 73 ఎకరాల మెట్ట భూములను మూడేళ్లపాటు కౌలుకు ఇచ్చేందుకు ఈనెల 6వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోవూరు గ్రామ సర్వే నెంబరు 439లో 44.3 ఎకరాలను ఒక ప్లాట్‌గా అదే సర్వే నెంబరులోని 28.6 ఎకరాలను మరో ప్లాట్‌గా విభజించి కౌలుకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒంగోలులోని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో జరిగే ఈ కౌలు బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు రూ. 50వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఈ వ్యవసాయ సీజన్ నుంచి మూడేళ్ల కాల పరిమితికి పాటలు నిర్వహించటం జరుగుతుందని, హెచ్చుపాటదారుడు వెంటనే పాట మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందనితెలిపారు.

రేపు వీవీపాలెం మండల సమావేశం

వలేటివారిపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యా లయంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో వై శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలస్థాయి అధికారులందరూ సమగ్ర సమాచారంతో హాజరుకావాలని కోరారు.

పొగ నాట్లలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పొగాకు రైతులతో మాట్లాడుతున్న కందుకూరు వేలం నిర్వహణాధికారి చంద్రశేఖర్

లింగసముద్రం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పొగనాట్లలో రైతులు సస్య రక్షణ చర్యలు పాటించాలని కందుకూరు పొగాకు బోర్డు రెండవ వేలం నిర్వహణాధికారి చంద్రశేఖర్ సూచించారు. గురువారం రాత్రి మండలంలోని విశ్వనాధపురం గ్రామంలో పొగనారుమడులు, పొగనాట్లు సాగులో మెలకువలను రైతులకు వివరించారు. పొగాకు నారు, పంటపై మాగుడు, నారుకుళ్లు తెగుళ్లు ఆశించకుండా రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సీనియర్ గ్రేడింగ్ అధికారి రాజగోపాల్ మాట్లాడుతూ పొగాకు రైతులు అంతర్జాతీయ పొగాకు మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొని యాజమాన్య పద్ధతులు పాటిస్తూ, తక్కువ విస్తీర్ణంలో నాణ్యమైన పొగాకును పండించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిసి మేనేజరు గోలి వెంకటేష్, జీపిఐ మేనేజరు ఉన్నం శ్రీనివాస్, ఎఫ్ఏలు నాగేంద్ర, రవీంద్ర, సిసింద్రీ, రైతులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో సత్తాచాటిన 'ప్రకాశం' విద్యార్థులు




అంతర్జాతీయ సదస్సులో పరిశోధనాపత్రంలో ప్రశంసలందుకున్న ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు మహిత, అమృత

కందుకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజంపేట అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు డేటా విజ్ఞానం, యంత్ర అధ్యయన రంగాలలో తమ ప్రతిభను చాటారని కళాశాల కరస్పాండెంట్ కంచర్ల విజయ్ శ్రీనివాస్ గురువారం తెలిపారు. కళాశాల ఏఐ విభాగం తృతీయ సంవత్సర విద్యార్థినులు మహిత, అమృత, ద్వితీయ సంవత్సరం సీఎస్ విద్యార్థి ఎంఆర్‌కేఎస్ ప్రసాద్‌లు సంయుక్తంగా రూపొందించిన పరిశోధనాపత్రం అంతర్జాతీయ సదస్సులో ఆమోదం పొందటమే గాక ప్రపంచ స్థాయిలో పేరుపొందిన స్ప్రింగర్ ప్రచురణలలో ముద్రణకు ఎంపికవటం తమ కళాశాలకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల పరిశోధనకు మార్గనిర్దేశం చేసిన ఆర్అండ్‌డీ డీన్ డాక్టరు ముప్పా లక్ష్మణరావును, విద్యార్థినీ విద్యార్థులను ఈ సందర్భంగా కరస్పాండెంట్ విజయ్ శ్రీనివాస్ అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని శాస్త్రీయ ఆవిష్కరణలు వెలువడాలని ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్ ఆకాంక్షించారు.

ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం



ఉచిత నేత్ర వైద్యశిబిరం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యసిబ్బంది, గ్రామస్థులు

కందుకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకూరు పంచాయతీ పంటవారిపాలెం వద్ద ఉన్న ఎల్వీ ప్రసాద్ నేత్రవైద్యవిజ్ఞాన సంస్థ ఆసుపత్రి ఆధ్వర్యంలో కోవూరు గ్రామంలో గురువారం ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. డాక్టరు షేక్ సమీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో 63మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారిలో 17మందికి శుక్లాలు ఆపరేషన్లు, ఐదుగురికి ఇతరత్రా నేత్రాలకు సంబంధించిన ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. అలాగే 29మందికి కంటి అద్దాలు అవసరమని నిర్ధారించినట్లు, వీరందరికీ అవసరమైన శస్త్రచికిత్సలు ఉచితంగా చేయటంతో పాటు కళ్లద్దాలు కూడా తక్కువ ధరలో అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ నేత్రవైద్యశాలల రాష్ట్ర కో ఆర్డినేటరు ఎండ్లూరి వెంకటేశ్వర్లు, సిబ్బంది నంబూరి సుధీర్‌కుమార్, సయ్యద్ ముస్తాక్, గ్రామపెద్ద ఎన్వీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

కందుకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ గాయత్రీ విద్యాపరిషత్ డిగ్రీ కళాశాలలో గురువారం కందుకూరు ప్రాంతీయ రవాణాశాఖ అధికారి టీవీ నాగలక్ష్మి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై నియోజకవర్గ పరిధిలోని స్కూళ్లు, కాలేజీల బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలకు దారితీస్తున్న పరిస్థితులు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథలు, పాటల రూపంలో వారికి అవగాహన కల్పించారు. అనంతరం ఆర్టీవో నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రతి బస్సుకు ఎమర్జెన్సీ డోరు వినియోగానికి అనువుగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేయటంతో పాటు ఫైర్ సిలిండర్, హేమర్‌లను ఉపయోగించే పద్ధతిపై డ్రైవర్లతో పాటు విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంవీఐ జె అనిల్‌కుమార్, శ్రీగాయత్రీ డైరెక్టర్ సీహెచ్ భరద్వాజ తదితరులు పాల్గొన్నారు.






బాలాయపల్లి వెంకటరెడ్డి పల్లి సమీపంలో ఉన్న నేరేడు బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరద నీరు


నాయుడుపేట మండలం తనమాలలో కోతకు గురైన రోడ్డు

● దిత్వా ఎఫెక్ట్

● పొంగుతున్న నదులు, వాగులు ● పలు మార్గాల్లో స్తంభించిన రాకపోకలు
● వేలాది ఎకరాల్లో మునిగిన వరిపొలాలు ● రూ.35 కోట్ల మేర నష్టం

వదలని వాన


సురక్షిత ప్రాంతాలకు రావాలని కోట మండలం పుచ్చలపల్లి గ్రామస్థులను కోరుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను బలహీనపడినా.. దాని ప్రభావం మాత్రం వీడలేదు. వరుసగా ఐదో రోజూ తీర ప్రాంత, చేరువగా ఉన్న మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. గురువారం తూర్పు మండలాల్లో నదులు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దాదాపుగా చెరువులు, కుంటలు నిండాయి. స్వర్ణముఖి బ్యారేజీ సహా కాళంగి, మల్లిమడుగు రిజర్వాయర్ల నుంచీ నీటిని దిగువకు వదులుతున్నారు. ఆయా మండలాల్లో పరిస్థితులను గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యేలు పాశం సునీల్ కుమార్, కురుగొండ రామకృష్ణ, విజయశ్రీ తదితరులు పరిశీలించారు.

గూడూరుపై తీవ్ర ప్రభావం : గూడూరులో బుధవారం రాత్రి నుంచీ వర్షం పడింది. పట్టణంలో పంబలేరు వాగు పొంగడంతో కాజ్‌వేపైకి నీరు చేరి వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. వేములపాడు, తిప్పవరప్పాడు వద్ద కాజ్‌వేలపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గూడూరు చవటపాలెం.. నెల్లటూరు.. చెన్నూరు రామలింగయ్య ఎస్టీ కాలనీల్లోకి వర్షపు నీరు చేరింది. చెన్నూరులో చేనేత మగ్గాల గుంతల్లోకి నీరు చేరడంతో 200 మంది కార్మికులు పనులు నిలిపివేశారు. 1700 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది.

● చిల్లకూరు మండలం తిప్పగుంటపాలెం ఇంకా జలదిగ్బంధనంలోనే వుంది. వరగలి క్రాస్ వద్ద జాతీయ రహదారిపైకి వరద నీరు చేరడంతో కిలోమీటరు వరకూ వాహనాలు నిలిచిపోయాయి.

● చిట్టమూరు మండలం పుట్టివానిపల్లి జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఆరూరు చెరువు కట్ట ప్రమాదకర స్థితికి చేరింది.

● కోట మండలం నెల్లూరుపల్లి ప్రాథమిక పాఠశాలలోకి, కొత్తపాలెం దళితవాడలో ఇళ్ళలోకి వర్షపు నీరు చేరింది. స్వర్ణముఖి ఉద్రుత ప్రవాహంతో దైవాలదిబ్బ, పుచ్చలపల్లి, దొరువుకట్ట అల్లంపాడు గ్రామాల వద్ద స్వర్ణముఖి పొర్లుకట్టలు తెగిపోయే స్థితిలో ఉన్నాయి. గోవిందపల్లి వద్ద బకింగ్‌హామ్ కెనాల్ ప్రవాహంతో గోవిందపల్లిపాలెం మత్స్యకారులకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.

● వాకాడు ఎస్సీ కాలనీ, వెంకటరెడ్డిపాలెం, బూర్లవారిపాలెం, తూపిలిపాలెం ఎస్టీ కాలనీలను వరద చుట్టుముట్టింది. స్వర్ణముఖి బ్యారేజీలోకి భారీగా వరద నీరు చేరుతుండడంతో 13 గేట్లు తెరిచి నీటిని వదిలారు.

20 మండలాల్లో రికార్డు స్థాయి వర్షపాతం

ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 20 మండలాల్లో రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. వాకాడు మండలంలో ఏకంగా 52 సెంటీమీటర్లకు పైగా.. మిగిలిన 19 మండలాల్లో 20 నుంచి 40 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గత నెల 30వ తేది ఉదయం 8.30 నుంచి ఈనెల 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు జిల్లాలో సగటున 215.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

మండలం	వర్షపాతం (మిల్లీ మీటర్లలో)
వాకాడు	525.5
చిట్టమూరు	494.8
గూడూరు	446.6
కోట	423.2
చిల్లకూరు	405.8
బాలాయపల్లి	271.8
వెంకటగిరి	213.8
డక్కిలి	210.4
దొరవారిసత్రం	353.4
ఓజిలి	309.6
నాయుడుపేట	289.2
తొట్టంబేడు	274.4
సూళ్ళూరుపేట	270.4
పెళ్ళకూరు	269.4
ఏర్పేడు	244.0
సత్యవేడు	240.2
తడ	234.4
శ్రీకాళహస్తి	224.2
బీఎన్ కండ్రిగ	222.2
వరదయ్యపాలెం	217.0
జిల్లా సగటు	215.3 మిల్లీమీటర్లు

వర్షాల నష్టం రూ.35 కోట్లు : వరుస వర్షాలకు రూ.35 కోట్లకు పైగా నష్టం సంభవించినట్లు ప్రాథమిక అంచనా. 11 మండలాల్లోని 69 గ్రామాలు ఎక్కువగా ప్రభావితమయ్యాయి. 1726 మంది కష్టనష్టాలకు లోనయ్యారు. దొరవారిసత్రం, సూళ్ళూరుపేట, వాకాడు, తడ, పెళ్ళకూరు మండలాల్లో 1821 హెక్టార్లలో వరి పంట నీటమునిగింది. అనధికారిక అంచనాల ప్రకారం 12 వేల ఎకరాలకు పైగా వరిపొలాలు దెబ్బతిన్నాయి.

దెబ్బతిన్న 41 ఇళ్ళు : వాకాడు మండలంలో 8 కచ్చా ఇళ్ళు పూర్తిగా కూలాయి. బాలాయపల్లిలో 4, వెంకటగిరిలో 3, చిట్టమూరులో ఒకటి చొప్పున 8 కచ్చా ఇళ్ళు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కోట మండలంలో 7, ఏర్పేడులో 15, బీఎన్ కండ్రిగ, శ్రీకాళహస్తి, తొట్టంబేడులో ఒక్కోటి చొప్పున 25 పూరి గుడిసెలు పడిపోయాయి. వీటి విలువ రూ.12.2 లక్షలుగా అధికారులు అంచనా వేశారు. ఒక ఆవు, గొర్రె మృతి చెందాయి.

విద్యుత్ శాఖకు రూ. 17.43 కోట్లు

గాలులకు 33 కేవీ ఫీడర్లు ఏడు, 33-11 కేవీ ఫీడర్లు 62 దెబ్బతిన్నాయి. అలాగే 33-11 కేవీ సబ్ స్టేషన్లు ఏడు, 11 కేవీ స్తంభాలు ఎనిమిది, ఎల్‌టీ స్తంభాలు ఎనిమిది చొప్పున కూలిపోయాయి. మొత్తం మీద రూ. 17.43 కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేశారు.

1. నాగలాపురం: కొత్తగాడులో కాజ్‌వేపై నీటి ప్రవాహంలో రోగిని భుజాలపై మోసుకెళుతున్న యువకులు
2. శ్రీకాళహస్తి: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నీరు
3. తడ: కారిజాత చెరువుకు పడిన గండిని పూడ్చుతున్న గ్రామస్థులు
4. చిల్లకూరు: వరగలిక్రాస్ రోడ్డు వద్ద నిలిచిన వాహనాలు

వెంకటగిరిలో వాగుల ఉధ్రుతి

● వెంకటగిరి మండలంలో కైవల్య నది, గొడ్డేరు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. బంగారుపేటలో చేనేత మగ్గం గుంతల్లో నీరు చేరడంతో పనులు ఆగిపోయాయి. ● డక్కిలి మండలం లింగసముద్రం వాగు ఉధ్రుతంగా ప్రవహిస్తోంది. ● బాలాయపల్లి మండలంలో కైవల్య నది పొంగి రామాపురం బ్రిడ్జిపైకి చేరగా.. నేరేడు కాలువ పొంగడంతో వెంకటగిరి-గూడూరు మెయిన్ రోడ్డులో వెంకటరెడ్డిపల్లి వద్ద.. గొట్టికాడు వద్ద కాజ్‌వేపైనా వరద నీటి ప్రవాహంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

సూళ్లూరుపేటలోనూ అదే స్థితి

● పెళ్ళకూరు మండలంలోని చెంబేడు చెరువు కట్ట కుంగి ప్రమాదకర స్థితికి చేరుకుంది. కలవకూరు వద్ద స్వర్ణముఖి డ్యామ్.. నాయుడుపేట వద్ద పండ్లూరు కాజ్‌వేపై వరదనీరు ప్రవహిస్తోంది. ● తడ మండలం ఇరకం దీవిలోని పొలాలను పులికాట్ ఉప్పు నీరు ముంచెత్తింది. ● నాయుడుపేట మండలం పెరికిలాంపాటి కండ్రిగ ముంపునకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. వెంగమాంబపురం వద్ద మామిడికాలువ ప్రవాహంతో వాహనాల రాకపోకలు ఆగాయి. ● దొరవారిసత్రం మండలం వేణుంబాక చెరువు కట్ట కుంగడంతో అధికారులు మరమ్మతులు చేపట్టారు.

పాడైన రోడ్లు

జిల్లావ్యాప్తంగా 106 కిలోమీటర్ల మేర అర్అండ్‌బీ రోడ్లు పాడయ్యాయి. చిట్టమూరులో ఒక రోడ్డు తెగిపోగా మరొకటి కోతకు గురైంది. వరద నీరు కాజ్‌వేలపై ప్రవహించడంతో మరో 30 రోడ్లు దెబ్బతిన్నాయి. ఆర్ అండ్ బీ రోడ్ల తాత్కాలిక మరమ్మతులకు రూ. 16.34 కోట్లు, శాశ్వత పనులకు రూ.97 కోట్లు అవసరమని అంచనా వేశారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 70 రోడ్లు దెబ్బతినగా, మరమ్మతులకు రూ.82.76 లక్షలు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు.


కోట మండలం పుచ్చలపల్లి వద్ద బలహీనంగా ఉన్న స్వర్ణముఖిపొర్లుకట్టలను పరిశీలిస్తున్న తెలుగుగంగ సీఈ వరప్రసాద్, అధికారులు

నేడు పాఠశాలల్లో
మెగా పీటీఎం 3.0

● 2513 ప్రభుత్వ విద్యాసంస్థల్లో పాల్గొననున్న 4,30,897 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు

తిరుపతి(విద్య), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో శుక్రవారం మెగా పీటీఎం (మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్) 3.0 జరగనుంది. జిల్లా సమగ్రశిక్ష, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లాలో మొత్తం 2,323 పాఠశాలల్లో 3,68,422 మంది, 195 జూనియర్ కళాశాలల్లో 62,475 మంది చొప్పున 4,30,897 మంది విద్యార్థులు, వారు తల్లిదండ్రులు మెగా పీటీఎం సమావేశాలకు హాజరుకానున్నారు. డీఈవో కేవీఎన్ కుమార్ ఆధ్వర్యంలో పాఠశాలల్లోను, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలల్లోను ఏర్పాటు సాగుతున్నాయి. వీటి నిర్వహణకు ప్రభుత్వం పాఠశాలలకు రూ.44,93,250, కళాశాలలకు రూ.15 లక్షలు చొప్పున రూ.59,93,250 విడుదలచేసింది. విద్యార్థుల సంఖ్యనుబట్టి ఆయా పాఠశాలలకు, కళాశాలలకు నిధులను కేటాయించారు. ఇందులో భాగంగా పేరెంట్స్‌కు క్రీడా పోటీలు, విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పిల్లల చదువు, నడవడిక, ప్రగతి గురించి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించి, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందించనున్నారు.

తిరుమలలో నేడు డయల్ యువర్ ఈవో

తిరుమల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరగనుంది. భక్తులు తమ సందేహాలు, సలహాలు, ఫిర్యాదులపై 0877 2263261 నెంబరును ఫోనుచేసి టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌తో మాట్లాడొచ్చు.

దక్షిణ మధ్య రైల్వేలో ఓటీపీ లింక్‌తో తత్కాల్ టికెట్లు

తిరుపతి(సెంట్రల్),డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలో ఇకపై ఓటీపీ లింక్‌తో తత్కాల్ టికెట్లు ఇవ్వనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రస్తుతం తిరుపతి నుంచి వివిధ మార్గాల్లో వెళ్లే వందేభారత్ రైళ్లలో ఈ పద్ధతి అమలు చేస్తున్నారు. 'ఆధార్‌తో లింక్‌అయిన ఫోన్ నెంబరు ఇవ్వాలి. టికెట్ బుక్ చేసే సమయంలో ఓటీపీ వచ్చాకే టికెట్ వస్తుంది' అని తెలిపారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు

● గ్రామస్థాయి నుంచి పార్లమెంటు స్థాయి వరకు కమిటీలు ● జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్




చిత్తూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఇస్తామని అని జనసేన అధ్యక్షుడు,డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. చిత్తూరు కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటుచేసిన డీడీవో కార్యాలయాన్ని గురువారం మధ్యాహ్నం ప్రారంభించిన ఆయన అదే ఆవరణలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. 'జనసేన బలోపేతానికి గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ, పార్లమెంటు స్థాయి వరకు ఐదుగురు సభ్యులతో కమిటీలను నియమిస్తాం. మరో 15 ఏళ్ల పాటే ఇదే స్ఫూర్తితో కొనసాగాలి. అప్పుడే అభివృద్ధి సుస్థిరమవుతుంది. కూటమి నాయకులతో చిన్న కమ్యూనికేషన్ గ్యాప్స్ ఉంటే కలిసి మాట్లాడుకుని పరిష్కరించుకోండి. వైసీపీ హయాంలో ఈ జిల్లాకే తలమానికమైన శేషాచలం అడవుల్ని అడ్డగోలుగా దోచేశారు. ఇప్పటివరకు దొరికిన సంపద 10 శాతం మాత్రమే. ఇదే రూ.వేల కోట్లలో ఉంటే.. దొరకనిది ఇంకెన్ని రూ.వేల కోట్లు ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. అలాంటి వాళ్లను మనం నిలువరించాలి'అన్నారు. గత నెలలో తిరుపతి, పలమనేరు ప్రాంతాల్లో పర్యటించిన పవన్ తమను పట్టించుకోలేదని జనసేన శ్రేణులు అసంతృప్తి చెందినట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ఈసారి జనసేన శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గ్రామాల్లో కూడా బెంజి కార్లు వెళ్తున్నాయంటే మీరు నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో జరిగిన అభివృద్ధే కారణమని పవన్‌ను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అభినందించారు. వైసీపీ ప్రభుత్వం చంద్రబాబును అక్రమంగా జైలులో పెట్టినప్పుడు.. మీరిచ్చిన సపోర్టు మరువలేనిదని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు.సీఎం అనుభవం, మీ సామర్థ్యంతోనే పీఆర్, ఆర్‌డీ శాఖలు బలోపేతమవుతున్నాయని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్ చెప్పారు. జనసేనకు నియోజకవర్గ, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో మరింత బలోపేతం చేసేలా ప్రణాళికలు రచిస్తున్నామని హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్, జనసేన నేత హరిప్రసాద్ చెప్పారు. కాగా, మధ్యాహ్నం 12 గంటలకు చిత్తూరుకు చేరుకున్న పవన్ కల్యాణ్ 2.10గంటలకు తిరుగుపయనమయ్యారు. చిత్తూరు డీడీవో కార్యాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వర్చువల్ విధానంలో 77 డీడీవోల కార్యాలయాలను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.


డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని, పక్కన డీడీవో నారాయణరెడ్డి, నేతలు

జిల్లాలో డీడీవో కార్యాలయాల ప్రారంభం

తిరుపతిరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నుంచి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వర్చువల్‌గా డీడీవో కార్యాలయాలను ప్రారంభించగా, జిల్లాలోనూ గూడూరులో అధికారులు, సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే విజయశ్రీ, శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయ పరిధిలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శక పాలన అందిస్తున్నట్లు చెప్పారు. తిరుపతి రూరల్‌లో జరిగిన కార్యక్రమంలో డీడీవో నారాయణరెడ్డి, నేతలు ఎ.ఈశ్వర్‌రెడ్డి, మధు, సుధాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.





మాలాడిగుండం



కపిలతీర్థం

జలపాతాల పరవళ్లు

తిరుపతి నగరానికి పచ్చని కిరీటంలా కనిపిస్తుంది తిరుమల కొండ. పాతిక కిలోమీటర్ల దూరం నుంచి కూడా పవళించిన అనంత శేషుడిలా కనిపించే ఈ కొండల బారు రుతువు రుతువుకీ తన అందాలు మార్చుకుంటుంది. ఎండాలకాలం మొక్కలు మోడులై తెల్లని బండలు మెరుస్తూ దర్శనమిస్తుంది. వాన కురిస్తే పరచకుకున్న ఆకుపచ్చదనం కనువిందు చేస్తుంది. ఎడతెగని తుఫాను వానలతో కొండల్లోంచి జాలువారుతున్న వాగులు వంకలతో, దూకుతున్న జలపాతాలతో శేషాచలం సౌందర్యవనంగా మారింది. కరకంబాడి నుంచి తలకోన దాకా కొండబారున ఎటు చూసినా పచ్చని అడవిలోంచి తెల్లని పాలనురగలా జారుతున్న జలపాతాలు కనిపిస్తున్నాయి. ఇవన్నీ తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి ప్రాంతాల నుంచి కనిపించే అందాలే. కొండలు ఎక్కి లోయల్లోకి దిగితే అనేక తీర్థాలు స్వాగతం పలుకుతాయి.



బీటీఆర్ కాలనీ

- స్టాఫ్ ఫోటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, తిరుపతి



తలకోన



మొండోడి కోన



మంగళం

జలపాతాల జీవకోన

తిరుపతి(జీవకోన),(అర్బన్)డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పరిధిలోని జీవకోనలో వెలసిన జీవలింగేశ్వరస్వామి జలపాతం కనువిందు చేస్తోంది. ఆలయం ఆనుకుని ఉన్న ఎత్తైన కొండ నుంచి జాలువారుతున్న ఈ జలపాతం లో భక్తులు పెద్ద సంఖ్యలో స్నానాలు చేస్తున్నారు. మంగళంలోని బీటీఆర్ కాలనీకి ఆనుకొని ఉన్న అటవీప్రాంతంలో కూడా కొండల నుంచి వచ్చే నీరు జోరుగా దూకుతున్నాయి. సమీప ప్రజలు ఆ ప్రాంతానికి చేరుకొని స్నానమాచరిస్తున్నారు. ఈ జలధారలు కాస్త దూరం ప్రవహించి ఆ తరువాత మాయమైపోయి, భూ అంతర్భాగంలో ప్రవహిస్తూ కొండకిందన మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇళ్లమధ్య కాలువల్లో దూసుకెళ్తూ చెన్నాయిగుంట చెరువులో కలుస్తోంది. అలాగే జీవలింగేశ్వరస్వామి ఆలయం నుంచి తూర్పు దిక్కున 300మీటర్లు వెళితే మొండోడికోన దర్శనమిస్తుంది. ఈ ప్రాంతం ప్రస్తుతం జల సవ్వడితో సందడి చేస్తోంది. కొండగుట్టల్లో చెట్ల మధ్యలో నుంచి జలపాతం దర్శనమిస్తోంది. స్థానికులు వీటిని సందర్శించి జలకాలాడుతున్నారు. ఆ నీరు దిగువ భవనాల మధ్య నుంచి ప్రవహిస్తూ మంగళం చెరువులోకి చేరుతోంది. లీలామహల్ సర్కిల్ నుంచి కరకంబాడి దాకా ఉత్తరపు దిక్కున కొండల్లోంచి అనేక తావుల్లో పాలధారల్లాంటి జలధారలు కనిపిస్తున్నాయి. వానలు కురిసినపుడు మాత్రమే ఇవి కనిపిస్తుంటాయి.



జీవలింగేశ్వర స్వామి ఆలయం



అబ్బురపరిచే పెంచలకోన జలపాతం

వెంకటగిరి నియోజకవర్గం.. నెల్లూరు జిల్లా పరిధిలోని రాపూరు మండలం పెంచలకోన పరవళ్లు తొక్కుతోంది. 500 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు నుంచి స్వచ్ఛమైన నీటి ప్రవాహంతో కిందికి దూకుతోంది.

- రాపూరు, ఆంధ్రజ్యోతి

శ్రీవారిసేవలో ప్రముఖులు



అశ్విన్, తమన్, ఓంకార్

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ మంత్రి బాలవీరాంజనేయ స్వామి, ఆర్మీ ఏపీ, తెలంగాణ సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్(జీవోసీ) మేజర్ జనరల్ అజయ్ మిశ్రా, ఇంటర్ విద్య డైరెక్టర్, కార్యదర్శి నారాయణ భరత్ గుప్తా, సినీ సంగీత దర్శకుడు తమన్, నటుడు అశ్విన్, నిర్మాత ఓంకార్ ఉన్నారు.

నిండుగా తిరుమల జలాశయాలు

- 2026 డిసెంబరు 15 దాకా సరిపడేంత నిల్వలు

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో తిరుమలలోని జలాశయాలు నిండుకుండల్లా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం నీటి నిల్వలను బట్టీ 2026 డిసెంబరు 15 వరకు తిరుమల అవసరాలకు సరిపడా నీరు ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.దాదాపు ఐదేళ్ల తర్వాత ఈస్థాయిలో డ్యాములు నిండటం ఇదే. ఇలానే మరో ఐదురోజులపాటు వర్షం కురిస్తే 2027 జనవరి వరకు సరిపడేన్ని నీళ్లు నిల్వచేయచ్చని భావిస్తున్నారు. వారం నుంచి తుఫాన్ ప్రభావంతో అడవుల్లో నుంచి పిల్ల కాలువల ద్వారా నీరు డ్యాముల్లో చేరుతోంది. ప్రస్తుతం పాపవినాశనం డ్యాం నుంచి మూడు ఇంచులు, గోగర్భ నుంచి రెండు ఇంచుల నీటిని దిగువకు వదులుతున్నారు.

నిండుతున్న మల్లిమడుగు

తిరుమలలోని మూడు డ్యాముల నుంచి నీరు ఓవర్‌ఫ్లో కావడంతో రెండు డ్యాముల గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.గోగర్భం డ్యాం నుంచి దిగువకు వెళుతున్న నీరు అవ్వాచారి కోనలోయ నుంచి 35 నుంచి 40 కిలోమీటర్ల దూరంలోని మల్లిమడుగు డ్యాంకు చేరుతున్నాయి. అలాగే ఆకాశగంగ, పాపవినాశనం, కుమారధార, పసుపుధార డ్యాముల నుంచి వెళుతున్న నీరు తుంబరకోనకు చేరి అక్కడి నుంచి మల్లిమడుగు డ్యాంకు ప్రవహిస్తున్నాయి.

తిరుమలలో ప్రదేశాల పేర్లు మార్చనున్న టీటీడీ

- సీఎం నుంచీ సానుకూల స్పందన

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి) మరింత ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా తిరుమలలోని ప్రదేశాలు, రోడ్లు, వసతి సముదాయాల పేర్లను మార్చాలని టీటీడీ ఆలోచిస్తోంది. తిరుమల క్షేత్రం వైభవానికి కారకులైన ఆళ్వారులు, అన్నమయ్య, పురందరదాసు వంటి వాగ్గేయకారులు పేర్లను పెట్టాలని అనుకుంటున్నారు. ఇందుకోసం దాదాపు 50 పేర్లను ఇప్పటికే సిద్ధం చేశారు. తిరుమలలో అనేక వసతి సముదాయాలను ఇప్పటికీ ఏటీసీ, ఎంబీసీ, ఏటీజీహెచ్, హెచ్‌వీసీ, ఎస్వీజీహెచ్ వంటి పేర్లతో పిలుస్తున్నారు. వీటికి ప్రసిద్ధుల పేర్లు పెట్టనున్నారు. మల్లంగుంట, మేదరమిట్ట అనే పేర్ల స్థానంలో కొత్త పేర్లు పెడతారు. అలాగే కొన్ని కూడళ్ల, రోడ్లకు కూడా ఆధ్యాత్మికవేత్తల పేర్లను పెట్టాలని భావిస్తున్నారు. ఈ పేర్ల వల్ల తిరుమలను సందర్శించే భక్తులు వారి చరిత్రను కూడా తెలుసుకుంటారని టీటీడీ భావిస్తోంది. పేర్ల మార్పు అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలుస్తోంది.



కార్తీక పౌర్ణమి దీపోత్సవం

తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం సాయంత్రం కార్తీక పౌర్ణమి దీపోత్సవం కన్నులపండువగా జరిగింది. మొదట యోగనరసింహస్వామి ఆలయం పక్కనే ఉన్న పరిమళం అర వద్ద కొత్త మూకుళ్లలో దీపాలను వెలగించారు. ఆనంద నిలయంలో శ్రీవారికి హారతి ఇచ్చారు. గర్భాలయంలో అఖండం, కులశేఖర పడి, రాములవారిమేడ, ద్వార పాలకులు, గరుడాళ్వారు, వరదరాజస్వామి సన్నిధి, వకుళమాత, బంగారుబావి, కళ్యాణమండపం, సభ అర, తాళ్లపాక అర, భాష్యకారుల సన్నిధి, యోగ నరసింహస్వామి, విష్వక్సేనులు, చందనం అర, పరిమళం అర, వెండివాకిలి, ధ్వజస్తంభం, బలిపీఠం, క్షేత్రపాలకుల సన్నిధి, తిరుమలరాయమండపం, పూలబావి, రంగనాయకమండపం, మహద్వారం, బేడిఆంజనేయస్వామి, వరాహస్వామిఆలయం, పుష్కరిణి వద్ద సుమారు వెయ్యి నేతి జ్యోతులను వెలిగించారు. టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



దళిత వ్యతిరేకి ఆదిమూలం: టీడీపీ

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దళిత వ్యతిరేకి అని ఆ నియోజకవర్గ టీడీపీ దళిత నాయకులు ఆరోపించారు. దళిత ఎమ్మెల్యే అని చెప్పుకుంటూ దళితులపైనే కక్ష సాధింపు చర్యలకు పాల్పడి అక్రమ కేసులు బనాయించారని ధ్వజమెత్తారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు మీడియాతో మాట్లాడారు. వైసీపీలో ఉంటూ టీడీపీలోకి వచ్చిన వెంటనే అధిష్ఠానం టికెట్ ఇచ్చిందని, తాము ఆయన గెలుపు కోసం శ్రమించామన్నారు. ఆయన చేసిన తప్పులతో పార్టీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. నాయకులు, కార్యకర్తల కోసం శంకర్‌రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారని తెలిపారు. దీనిని జీర్ణించుకోలేని ఎమ్మెల్యే ఆదిమూలం పెత్తందారీ పెత్తనం అంటూ ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కులమతాలకు అతీతంగా శంకర్‌రెడ్డి పనిచేస్తూ దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని చెప్పారు. వైసీపీ నుంచి వచ్చిన ఆదిమూలం ఇప్పటికీ ఆ పార్టీ వారికే ప్రాధాన్యమిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ పారి చందన స్రవంతి, నాయకులు బి.జ్ఞానకుమార్, నెల్సన్ మండేలా, శ్రీనివాసులు, ధనశేఖర్, రమేష్, దశరదన్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి డివిజన్ డిమాండ్



రైల్వే మంత్రి అశ్విన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాధనసమితి నాయకులు, ఏపీ ఎంపీలు

తిరుపతి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు డిమాండ్‌ను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ దృష్టికి సాధన సమితి సభ్యులు తీసుకెళ్లారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, పార్లమెంట్ టీడీపీ ఫ్లోర్ లీడర్ లావు కృష్ణదేవరాయలు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌తో కలిసి గురువారం పార్లమెంట్‌లోని కేంద్ర మంత్రి చాంబర్‌లో వినతి పత్రం అందజేశారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, లావు కృష్ణదేవరాయలు బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను రైల్వే మంత్రికి వివరించారు. 30 ఏళ్లుగా నెలకొన్న డిమాండ్‌ను పరిష్కరించాలని కోరారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి న్యాయ సముచితంగా అదనపు రైల్వే డివిజన్ ఏర్పాటు అవసరమన్నారు. యాత్రికుల తాకిడి పెరిగిన దృష్ట్యా తిరుచానూరు, రేణిగుంట,చంద్రగిరి రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలని కోరారు. హైదరాబాద్ నుంచి గూడూరు వరకు వచ్చే సింహపురి ఎక్స్‌ప్రెస్‌ను రేణిగుంట వరకు పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్, సభ్యులు ఎమ్.వేణుగోపాల్ రెడ్డి, వీసీ రాయల్, కేవీ చౌదరి, సూరినేని బుజ్జి బాబు నాయుడు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆలస్యంగా విమానాల రాకపోకలు

రేణిగుంట డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): వాతావరణం అనుకూలించక పలు విమానాలు ఆలస్యంగా నడిచాయి. గురువారం ఉదయం హైదరాబాదు నుంచి వచ్చిన ఇండిగో విమానం తప్ప మిగిలినవన్నీ గంట నుంచి రెండు గంటలు వరకు ఆలస్యంగా రాకపోకలు సాగించాయి.

26 నుంచి విద్యాపీఠంలో భారతీయ విజ్ఞాన సమ్మేళనం

- సీఎం, డిప్యూటీ సీఎం, ఆర్ఎస్ఎస్ చీఫ్ రాక
- 29న ముగింపు రోజు ప్రధాని హాజరయ్యే అవకాశం

తిరుపతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత విద్యా పీఠంలో ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు భారతీయ విజ్ఞాన సమ్మేళనం జరగనుంది. ఆర్ఎస్ఎస్ అనుబంధ విభాగమైన విజ్ఞాన భారతి సంస్థ చేపట్టే ఈ కార్యక్రమం తొలిరోజు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, ధర్మేంద్ర ప్రధాన్ తదితరులు హాజరు కానున్నట్టు సమాచారం. ముగింపు వేడుకలకు ప్రధాని మోదీ హాజరయ్యే అవకాశముంది. ఇప్పటి వరకూ దేశవ్యాప్తంగా వేర్వేరు నగరాల్లో ఆరు సమ్మేళనాలు జరగగా ఏడవ సమ్మేళనం తిరుపతిలో జరిపేందుకు నిర్వాహకులు నిర్ణయించి ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నైపుణ్యాల పెంపునకు పరిశ్రమలతో భాగస్వామ్యం

- వెటర్నరీ పీజీవిద్యార్థుల జాతీయసదస్సులో డాక్టర్ ప్రకాశ్‌రావు



సదస్సు సావనీర్ ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

తిరుపతిరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు ఉపాధి, ఉద్యోగ నైపుణ్యాలను పెంచేందుకు పరిశ్రమలతో భాగస్వామ్యం ఎంతో అవసరమని చెన్నైకి చెందిన ప్రకాశ్ ఫుడ్స్ అండ్ ఫీడ్‌మిల్స్ సంస్థ చైర్మన్ డాక్టర్ డీవీఆర్ ప్రకాశ్‌రావు పేర్కొన్నారు. ఎస్వీ వెటర్నరీ కళాశాల వేదికగా గురువారం 'ఇంపాక్ట్ ఆఫ్ వెటర్నరీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్స్ ఆన్ యానిమల్ హెల్త్ అండ్ ప్రొడక్టివిటీ' అంశంపై నిర్వహించిన జాతీయసదస్సులో ఆయన మాట్లాడారు. కాలానుగుణంగా మల్టీ డిసిప్లినరీ పరిశోధనలు రూపొందించాలన్నారు. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పరిశోధనలు రూపొందించడంపై పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు దృష్టిసారించాలని తెలిపారు. గౌరవఅతిథిగా హాజరైన విశాఖకి చెందిన ఆంకో సీక్ బయో సంస్థ చైర్మన్ డాక్టర్ పూసల సురేష్ మాట్లాడుతూ.. శాస్త్రీయ పరిశోధనల పురోగతికి ప్రయోగశాల, జంతువుల పాత్రని వివరిస్తూ..నాణ్యమైన పరిశోధనలు ఆవిష్కరించాలన్నారు. జీవీటీస్‌సంస్థ చైర్మన్ డాక్టర్ కిశోర్ ప్రయాగ, వర్సిటీ డీఆర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత, వెటర్నరీసైన్స్ డీన్ డాక్టర్ ఆర్వీ సురేష్‌కుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య మాట్లాడారు. ప్రొఫెసర్ డాక్టర్ బి.రాంబాబునాయక్, కోఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ కె.సుధీర్, డాక్టర్ వై.మురళీధర్, డాక్టర్ చైతన్య, డాక్టర్ రాజ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో నేడు డయల్ యువర్ ఈవో

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరగనుంది. భక్తులు తమ సందేహాలు, సలహాలు, ఫిర్యాదులపై 0877 2263261 నెంబరును ఫోనుచేసి టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌తో మాట్లాడొచ్చు.

23, 29న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో డిసెంబరు 23న జరిగే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి), వైకుంఠ ఏకాదశి ముందురోజు 29వ తేది వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్టు టీటీడీ గురువారం ప్రకటించింది. వైకుంఠ ద్వార దర్శనాలు జరిగే పదిరోజుల పాటు స్వయంగా వచ్చే ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకు వీఐపీ బ్రేక్‌ను పరిమితం చేసి సిఫార్సు లేఖలపై ఇచ్చే బ్రేక్ దర్శనాలను చేస్తున్నట్టు టీటీడీ ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే.

బహుమతి పేరిట మోసం

- రూ.3.5 లక్షలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

తిరుపతి(నేరగాళ్ళు), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బహుమతి పేరు చెప్పారు. వివరాలన్నీ తెలుసుకుని ఆ వ్యాపారి ఖాతాలో రూ.3.5 లక్షలు లాగేసుకున్నారు సైబర్ నేరగాళ్లు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతిలోని ఓ వ్యాపారికి వారం కిందట గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్ కాల్ చేశాడు. ఢిల్లీ నుంచి మాట్లాడుతున్నామని, మీరు ఆన్‌లైన్ ద్వారా ఇటీవల టీవీ కొన్నారు కదా? మేము తీసిన లక్కీ డ్రాలో మీకు ద్విచక్ర వాహనం బహుమతిగా వచ్చిందని చెప్పాడు. ఒకవేళ బహుమతి వద్దనుకుంటే, దానికి సరిపడా డబ్బును రెట్టింపుగా మీ అకౌంటులో జమ చేస్తామని నమ్మపలికారు. దానికోసం అకౌంటు నెంబరు, ఐఎఫ్ఎస్సీ కోడ్, ఆధార్ నెంబరు తదితర వివరాలు అడిగాడు. దీనిని నమ్మిన ఆ వ్యాపారి వాళ్లు అడిగిన వివరాలన్నీ చెప్పారు. ఆ తర్వాత మీకు అకౌంటులో డబ్బులు పడాలంటే ముందుగా మీరు కొంత నగదు చెల్లించాలని చెప్పాడా వ్యక్తి. దీంతో తన అకౌంటు నుంచి 10,000 పంపారు. ఆ తర్వాత వ్యాపారి అకౌంటులో ఉన్న దాదాపు రూ 3.45 లక్షలు కొట్టేశాడా సైబర్ నేరగాడు. మొబైల్‌కు వచ్చిన మెసేజ్ చూసి అవాక్కయిన వ్యాపారి లబోదిబోమంటున్నారు. ఈ విషయం ఎవరికైనా తెలిస్తే అవమానమని మిన్నకుండిపోయారు. పోలీసులకూ ఫిర్యాదు చేయలేదు.

ఎంఎస్ఎంఈ పరిశ్రమలతో యువతకు మెరుగైన ఉపాధి

- సీఐఐ పార్టనర్ సమ్మిట్‌లో జిల్లాకు 61మందితో ఎంవోయూ కుదిరిందన్న కలెక్టర్



తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖలో జరిగిన సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో జిల్లాలో వివిధ పరిశ్రమల స్థాపనకు రాష్ట్రప్రభుత్వంతో 61మంది ఎంవోయూ కుదుర్చుకున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో సీఐఐ భాగస్వామ్య సదస్సు పెట్టుబడిదారుల సమావేశం, జిల్లా పరిశ్రమయల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నూతన ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనతో యువతకు మెరుగైన ఉపాధి కల్పించేలా పరిశ్రమలశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. సింగిల్ డెస్క్ విధానం ద్వారా అక్టోబరు నుంచి 1,821 పరిశ్రమలకుగాను 1,755 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామని మరో 56 పరిశీలనలో ఉన్నాయన్నారు. ఇక 13 పరిశ్రమలకు ప్రోత్సాహకాలకు రూ.77.45లక్షలు అందించడానికి పరిశీలన కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఈ కార్యక్రమంలో పెట్టుబడిదారులు, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజరు చంద్రశేఖర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు విజయభరత్ రెడ్డి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ రామకృష్ణారెడ్డి తదితరులుపాల్గొన్నారు.

అందరి మద్దతుతో ఉద్యమం



మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ దశరథరామిరెడ్డి

గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజలందరి మద్దతుతో ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళుతామని గూడూరు జేఏసీ కన్వీనర్ దశరథరామిరెడ్డి అన్నారు. రోటరీభవన్‌లో గురువారం జరిగిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేయడమో, లేక ప్రత్యేక జిల్లాగానో ప్రకటించాలన్నారు. ఏదో ఒక నిర్ణయం తీసుకునే వరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. వివిధ పార్టీలు, కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలను కలుపుకుని శాంతియుత పోరాటాన్ని సాగిస్తూ ఇచ్చిన హామీని సాధించుకునేంత వరకు ముందుకు వెళుతామన్నారు. జేఏసీ కార్యదర్శిగా చిరువెళ్ల సునీల్‌కుమార్, కోశాధికారులుగా నిరంజన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జమాలుల్లా, జాయింట్ సెక్రటరీగా నాగేశ్వరరావు, సభ్యులను ఎన్నుకున్నారు. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతి కేసులో నిందితుడి అరెస్టు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు, పక్కన సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు

సూళ్లూరుపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేగేటు సమీపంలో ఉన్న కృష్ణా లాడ్జిలో గత నెల 30న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మహిళ కేసును పోలీసులు ఛేదించారు. మృతురాలు తమిళనాడుకు చెందిన ఉషాగా గుర్తించారు. తమిళనాడు రాష్ట్రం పొన్నేరికి చెందిన ఆర్.సుబ్రహ్మణ్యంను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు కథనం మేరకు... తమిళనాడు రాష్ట్రం పొన్నేరికి చెందిన ఆర్.సుబ్రహ్మణ్యానికి అదే ప్రాంతానికి చెందిన ఉషాతో పరిచయం ఉంది. ఇద్దరూ తరచూ తమిళనాడులోని ఏళావూరు, గుమ్మిడిపూడి ప్రాంతాల్లో కలుసుకునేవారు. ఈవిషయం సుబ్రహ్మణ్యం భార్యకు తెలియడంతో ఉషాతో సంబంధం వదులుకోకుంటే ఇంటి నుంచి వెళ్లిపోతానని హెచ్చ రించింది. ఈ నేపథ్యంలో ఈనెల 29న ఉషాతో కలిసి సుబ్రహ్మణ్యం పొన్నేరి నుంచి రైలులో సూళ్లూరుపేటకు వచ్చారు. తాము భార్య, భర్త అని, చెంగాళమ్మ దర్శనానికి వచ్చామని కృష్ణా లాడ్జిలో గది తీసుకున్నారు. అదేరోజు రాత్రి తన ఇంట్లో జరిగిన గొడవ విషయాన్ని సుబ్రహ్మణ్యం ఉషాకు చెప్పాడు. మనమిద్దరం ఇకపై కలుసుకోలేము.. విడిపోదాం అని చెప్పాడు. ఇందుకు ఉషా అంగీకరించపోవడంతో ఇరువురి నడుమ తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో సుబ్రహ్మణ్యం ఉషాను గట్టిగా తోయడంతో ఆమె మంచంపై పడి స్పృహతప్పి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దిండుతో ఊపిరాడకుండా ఒత్తడంతో మృతి చెందింది. మృతదేహాన్ని మంచం పైనే పగుకోబెట్టి చీరకప్పి అక్కడ నుంచి సుబ్రహ్మణ్యం పరారయ్యాడు. 30వ తేదీన ఉదయం లాడ్జి సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు లాడ్జిలో ఇచ్చిన అడ్రసు ఆధారంగా నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసును త్వరతగతిన ఛేదించిన సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

వంద కోట్లతో పట్టణాభివృద్ధి: కురుగొండ్ల



పైప్‌లైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, డిసెంబర్ 4(ఆంధ్రజ్యోతి): అమృత్ పథకం నిధులు రూ.100 కోట్లతో పట్టణాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. గురువారం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన, కాంపాళెం వద్ద గొడ్డేరు ప్రవాహాన్ని, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద పైప్‌లైన్ లీకేజ్ మరమ్మతు పనులను, బంగారుపేట వద్ద చేనేత మగ్గం గుంతల్లో వర్షపు నీరు చేరడాన్ని పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడారు. తాగునీటి సరఫరా, డ్రైనేజ్ వ్యవస్థ ఆధునికీకరణకు చర్యలు తీసుకొంటున్నట్లు వివరించారు. పట్టణంలోని సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ నుంచి నీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ పనులను గత పాలకులు నాసిరకంగా చేయడం వల్ల లీకేజీ జరుగుతోందన్నారు. కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. భారీ వర్షాలు వచ్చినప్పుడు పట్టణంలోని గొడ్డేరువాగు వాగు ఉధృతి పెరిగి రాకపోకలకు అంతరాయం కలిగిస్తుండడంతో వంతెన నిర్మాణానికి రూ.5.75 లక్షల వ్యయంతో గతంలో అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపామని, ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.6.75 లక్షలతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేసించారు. పట్టణంలోని బొగ్గులమిట్ట, కాంపాళెం, బంగారుపేట ప్రాంతాల్లో పర్యటించిన ఆయన వర్షాలకు దెబ్బతిన రహదారులు, ఇళ్లను పరిశీలించారు. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా మగ్గం గుంతల్లో నీరుచేరి చేనేతలకు పనులు లేకుండా పోయాయని, వారికి నిత్యావసర సరుకులు అందించాలని తహసీల్దారు నరసింహారావుకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, సీఐ రమణ, ఎస్‌ఐ ఏడుకొండలు, టీడీపీ నాయకులు బీరం రాజేశ్వరావు, పప్పు చంద్రమౌళిరెడ్డి, అవ్వారు సత్యనారాయణ, మంకు ఆనంద్, పరుచూరి నరసయ్య నాయుడు, భాస్కర్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపు అంచున చెంబేడు చెరువు



చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల, నరసింహ యాదవ్ తదితరులు

పెళ్లకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబేడు చెరువు నిండు కుండను తలపిస్తూ ప్రమాదపు అంచుకు చేరింది. ఓ వైపున చెరువు కట్ట కుంగడంతో అధికారులు గురువారం ఉదయం పరిశీలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్య, యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహయాదవ్ అధికార యంత్రాగంతో కలిసి చెరువును పరిశీలించారు. కట్ట పటిష్టతకు యుద్ధ ప్రాదిపతికన చర్యలు చేపట్టారు. కట్టపై టార్పాలిన్ పరచి దానిపైన మట్టి, ఇసుక బస్తాలను ఏర్పాటు చేయించారు. చెరువు తెగితే దిగువ ప్రాంతమైన ఎగువతాగేలి ఎస్సీ కాలనీ ముంపునకు గురైయ్యే అవకాశం ఉండడంతో గ్రామస్తులను చిల్లకూరు సచివాలయంలోని పునరావస కేంద్రానికి తరలించారు. ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు గురువారం రాత్రి పునరావస కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న వారితో మాట్లాడారు. కార్యక్రమంలో నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ మండల అధ్యక్షుడు నంచి కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, కందమూడి శివకుమార్, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, పాపాడి రాజగోపాల్‌రెడ్డి, మదన్‌మోహన్ నాయుడు, నూతలపాటి ప్రసాద్ నాయుడు, కలవకోలు మునీష్ పాలచ్చూరు నరేంద్రయాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు మల్లాం విజయ్, తాళ్ల రెడ్డిశ్రీనివాస్, మల్లిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, వేణురెడ్డి తదితరులు పాల్గొన్నారు

గిరిజనులకు ఆహారం పంపిణీ

గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లటూరు చవట గిరిజనకాలనీ, గ్రామంలోని గిరిజన కాలనీల్లో వరదనీరు నివాసగృహాల్లోకి చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. నెల్లటూరులోని పునరావస కేంద్రంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్‌రెడ్డి దాతృత్వంతో రోటరీవెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో 400 మంది గిరిజనులకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, రాఘవరెడ్డి, సిద్దారెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.



పేదలకు ఆహారాన్ని అందిస్తున్న రోటరీవెస్ట్‌క్లబ్ సభ్యులు





గూడూరు మండలం చెన్నూరు వద్ద రామలింగయ్య జగనన్నకాలనీలో ఇళ్లల్లోకి చేరిన వర్షపునీరు - నాయుడుపేట: ఉధృతంగా ప్రవహిస్తున్న మామిడి కాలువ

ముంచెత్తిన వాన

- చప్టాలపై పారుతున్న వరద
- చెరువులు నిండి పారుతున్న కలుజులు
- నివాస గృహాల్లోకి చేరిన నీరు
- సముద్రతీర ప్రాంతాలు అతలాకుతలం
- మూడు గ్రామాలకు తెగిపోయిన సంబంధాలు

గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ తీవ్ర రూపం దాల్చడంతో బుధవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కుండపోత వర్షం కురుస్తోంది. ఎగువ ప్రాంతాల్లో పడిన వర్షం, జలాశయాల నుంచి విడు దల చేసిన నీటితో వాగులు ఉధృతంగా ప్రహిస్తున్నాయి. గూడూరు మండ లంలోని వేములపాళెం చప్టాపై వరదనీరు ప్రవహిస్తుండడంతో మిటాత్మ కూరు వరకు సుమారు పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తిప్పవరప్పాడు సమీపంలో చప్టాపై నీటి ప్రవాహం పెరగడంతో గూడూరు నుంచి సైదాపురం - రాపూరు మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. గూడూరు పంబలేరు చప్టాపై ఉధృతంగా వరదనీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలుపుదల చేశారు. గూడూరు చెరువు జలకళను సంత రించుకుంది. చల్లకాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. నెల్లటూరు చవట గిరిజనకాలనీ, చెన్నూరులోని రామలింగయ్య గిరిజనకాలనీ, గూడూరులోని చవటపాళెం గిరిజన కాలనీల్లోని నివాసగృహాల్లోకి నీరు చేరి వస్తువులు తడిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ చవటపాళెం గిరిజనకాలనీని పరిశీలించి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మదురెడ్డికాలనీ సమీపంలో రోడ్డు గోతులమయంగా మారడంతో విందూరు మార్గంలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తిప్పవరప్పాడు సమీపంలో రోడ్డు దుస్థితికి చేరుకోవడంతో సైదాపురం వెళ్లేవారు అవస్థలు పడుతున్నారు. చెన్నూరు గ్రామంలో సుమారు 200 మంది చేనేత కార్మికులకు చెందిన మగ్గం గుంటల్లోకి నీరు చేరడంతో పనులు లేక, వస్తువులను నష్టపోయారు. మండలంలోని 40 చెరువులు నిండి కలుజులు పారుతున్నాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోకి మోకాళ్లలోతు నీరు చేరడంతో విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా ఆర్‌అండ్‌బీ, ఐసీడీఎస్ తదితర కార్యాలయాల ఆవరణలో నీరు చేరింది. వర్షాలకు చవటపాళెం, పురిటిపాళెం, నెల్లటూరు, తిప్పవరప్పాడు గ్రామాలతో పాటు పట్టణంలోని జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి లోతట్టు ప్రాంతాల వారిని అక్కడకి తరలించి భోజన సదుపాయం కల్పించారు. మండలంలో సుమారు 1700 ఎకరాల్లో వరినాట్లు నీటమునిగాయి.

చిల్లకూరు: ఎడతెరపి లేని వానతో మండలంలోని తిప్పగుంటపాళెం, పారిచెర్లవారిపాళెం, రెట్టపల్లి, తీపనూరు గ్రామాల సమీపంలోని చప్టాల పైకి నీరు చేరింది. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలను నిలిపివేశారు. తిప్పగుంటపాళెం జలదిగ్బంధంలో చిక్కుకుంది. వరగలి క్రాస్‌రోడ్డు వద్ద సాగరమాల రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన సర్వీసు రోడ్డు దెబ్బతినడంతో వాహనాల రాకపోకలకు ఆగిపోయి గంటన్నర పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పారిచెర్ల వారిపాళెం, రెట్టపల్లి వద్ద చప్టాలపై వరదనీటి ప్రవాహాన్ని తహసీల్దారు శ్రీనివాసులు, ఎస్‌ఐ సురేష్‌బాబు పరిశీలించి రాకపోకలు నిలిపివేసి బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలో ఐదు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించి భోజన సదుపాయం కల్పించారు.



వాకాడు: బాలిరెడ్డిపాళెం వద్ద స్వర్ణముఖిలో వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి

నాయుడుపేట: పండ్లూరు కాజ్‌వేపై వరదనీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలను ఆపేశారు. తన్నమాల గ్రామానికి వెళ్లే తారురోడ్డు కోతకు గురైంది. పెరికలంపాటికండ్రిగ వద్ద సాగరమాల రోడ్డు అండర్‌బ్రిడ్జి భూమి ఉపరితలం కన్నా ఎత్తుగా ఉండటంతో వరదనీరు పొలాల్లోకి చేరింది. పట్టణంలో వర్షపునీరు నిల్వ చేరకుండా మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా మినీ ఎక్స్‌వేటర్‌తో డ్రైనేజీల్లో పూడిక తీయించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వర్షపునీరు చేరడంతో ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. మండలంలోని 57 చెరువులు నిండుకుండల్లా తొణికిసలాడుతున్నాయి. కొన్ని చెరువులు ప్రమాదభరితంగా ఉండటంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. మండలంలోని వెంగమాంబపురం గ్రామ సమీపంలో ఉన్న మామిడికాలువ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తహసీల్దారు రాజేంద్ర పరిశీలించి రాకపోకలను నిలిపేశారు.

వాకాడు: నాలుగు రోజులుగా ఎడతెరపిలేకుండా వర్షం కురవడంతో వాకాడు ఎస్సీ కాలనీ, గొల్లపాళెం, వెంకటరెడ్డిపాళెం, బొల్లవారిపాళెం, బాలిరెడ్డిపాళెం, తూపిలిపాళెం, ఉప్పుటేరు పొంగడంతో మాధవాపురం, గున్నమానితిప్ప, నవాబుపేట, మనపాళెం, పూడిరాయ దొరువు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రొయ్యలకాలువ వరద ఉధృతి పెరగడంతో ముట్టెంబాక, కల్లూరు, కొత్తపాళెం, బాలిరెడ్డిపాళెం, కొండూరు, తిరుమూరు, దుగరాజపట్నం, రావిగుంటపాళెం, నిడిగుర్తి తదితర గ్రామాల్లో సుమారు 8వేల ఎకరాల వరినాట్లు నీట మునిగాయి. స్వర్ణముఖి బ్యారేజీకి 26 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండటంతో 13గేట్లను నీటిని దిగువకు వదులుతున్నారు. బాలిరెడ్డిపాళెం వంతెనపై ప్రవహిస్తున్న వరద ప్రవాహాన్ని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి పరిశీలించారు. స్వర్ణముఖి బ్యారేజీ వద్ద వరద ప్రవాహాన్ని తిరుపతి ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ వరప్రసాద్, ఎస్‌ఈ రాధాకృష్ణమూర్తి, డీఈ బాబు పరిశీలించారు.

ఓజిలి: మండలంలో 500 ఎకరాల్లో వరినాట్లు నీటమునిగాయి. వర్షాలు, నీటి ప్రవాహం ఆగితే పంట నష్టాలను అంచనాలు వేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

చిట్టమూరు: మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే సునీల్ కుమార్ పర్యటించారు. యల్లసిరి గ్రామంలో నీట మునిగిన పొలాలను పరిశీలించారు. మల్లాం మార్గంలోని తాగేటమ్మగుడి వద్ద పులి కాలువ వంతెనను పరిశీలించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. మండలంలో బలహీనంగా ఉన్న చెరువు కట్టలను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఎస్‌ఐ చిన్న బలరామయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు, చిన్నారావు, మారంరెడ్డి జనార్దన రెడ్డి, రాజేష్‌రెడ్డి, షేక్ రషీద్‌బాషా, హరికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కోట: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కోట మండలం అతలాకుతలమైపోయింది. స్వర్ణముఖి ముంపు గ్రామాలైన దొరువుకట్ట, దైవాలదిబ్బ జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. ఆయా గ్రామాల మీదుగా వెళ్లే స్వర్ణముఖి పొర్లుకట్టలు తెగిపోయే అవకాశం ఉండటంతో అసిస్టెంట్ కలెక్టర్ సందీప్ రఘువరేష్, తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ వరప్రసాద్, ఎస్‌ఈ రాధాకృష్ణ, ఈఈ బాబు, తహసీల్దారు జయజయరావు, ఏఈ మునిరత్నం పరిశీలించారు. అదే విధంగా గోవిందపల్లి వద్ద బకింగ్‌హామ్ కెనాల్ పొంగడంతో నీరంతా రోడ్డును కమ్మేసింది. నెల్లూరుపల్లి ప్రాథమిక పాఠశాల జలదిగ్బంధంలో చిక్కుకుంది. నెల్లూరుపల్లి కొత్తపాళెంలో ఉన్న దళితవాడ నివాసాల్లోకి వర్షపునీరు చేరింది. గూడలి వద్ద ఉన్న స్వర్ణముఖి నది ఎగువభాగం నుంచి వచ్చే వరదనీటితో పరవళ్లు తొక్కుతోంది. తిన్నెలపూడి క్రాస్‌రోడ్డు వద్ద స్వర్ణముఖినదికి ఉన్న నాలుగు లాక్‌లను ఇరిగేషన్ అధికారులు ఎత్తేయడంతో ఆ నీరంతా చల్లకాలువ నదిలోకి ప్రవహిస్తోంది.

తడ: దిత్వా తుఫాన్‌తో ఐదు రోజులుగా పడిన వర్షంతో గురువారంతో తెరపిచ్చింది. ఆకాశం మేఘావృతమై ఉన్నా వర్షం పడలేదు. ఐదు రోజులుగా కురిసిన వర్షాలకు చెరువులన్నీ నిండుకుండల్లా మారాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో పాములకాలువ, కరిపేటి కాలువలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చుట్టుపక్కల పొలాలన్నీ నీటమునిగాయి. ఇరకందీవిలో సుమారు 300 ఎకరాలల్లో పులికాట్ ఉప్పునీళ్లు వచ్చి చేరడంతో పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొంది. కారిజాత చెరువుకుపడిన గండిని గురువారం పూడ్చివేశారు. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు శరత్‌బాబు, ఇరిగేషన్ అధికారులతో కలసి పరిశీలించారు.

సూళ్లూరుపేట: ఆరు రోజుల నుంచి వదలని వానతో వాగులు, వంకలు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాల్లో పంట పొలాలు నీటి మునిగాయి. చెరువుల ప్రమాదపుటంచుకు చేరాయి. కాళంగి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆర్డీవో కిరణ్మయి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుని అన్నిశాఖల అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య వట్రపాలెం వెళ్లి అక్కడ ప్రజలను మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.







చిల్లకూరు: తీపనూరు సమీపంలోని చప్టాపై వరదనీరు - కోట: జలదిగ్బంధంలో నెల్లూరుపల్లి ప్రాథమిక పాఠశాల - తడ: ఇరకంలో పంటపొలాలను ముంచెత్తిన పులికాట్ ఉప్పునీళ్లు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్



డక్కిలి: మాటుమడుగు వద్ద చప్టాను పరిశీలించిన అనంతరం అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన ఎమ్మెల్యే కురుగొండ్ల

డక్కిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుపాను సమయంలో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చూడాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం ఆయన వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి మాటుమడుగు వద్ద చప్టాపై పంబలేరు వాగు ఉధృతిని పరిశీలించారు. పంబలేరు వాగు ప్రవాహంతో మాటుమడుగు - వర్దనపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోవడమే కాకుండా పంట పొలాలు కోతకు గురవుతున్నట్లు ఆ ప్రాంతవాసులు కలెక్టర్‌కు వివరించారు. చప్టాపై బ్రిడ్జి నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. వరదలు సంభవించినప్పుడు ప్రజలు పడుతున్న ఇబ్బందులకు కలెక్టరుకు ఎమ్మెల్యే కురుగొండ్ల వివరించారు. తుఫాను కారణంగా నియోజకవర్గంలోని రోడ్లనన్నీ బాగా దెబ్బతిన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ బాబురెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: కాంపాళెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గొడ్డేరు వాగును వెంకటేశ్వర్ ఎమ్మెల్యే కురుగొండ్లతో కలిసి పరిశీలించారు. వరదల సమయంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ వాగుపై వంతెన నిర్మాణానికి త్వరితగతిన అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పపాలని అధికారులను ఆదేశించారు. వారి పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, మంకు ఆనంద్, అధికారులు ఉన్నారు.

కోట: మండలంలోని పుచ్చలపల్లి వద్ద స్వర్ణముఖి కరకట్టలను గురువారం రాత్రి కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. పొర్లుకట్టలు ఏక్షణంలోనైనా తెగిపోయి గ్రామం గల్లంతయ్యే ప్రమాదం ఉన్నందున వాకాడు మండలం వాలమేడు ఉన్నత పాఠశాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఏఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ గీతాకుమారి, ఇన్‌చార్జి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, సీఐ హుస్సేన్‌బాషా, తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ఇరిగేషన్ ఏఈ మునిరత్నం, ఎస్‌ఐ పవన్‌కుమార్, అగ్నిమాపక సిబ్బంది పుచ్చలపల్లిలోనే ఉంటూ పరిస్థితిని అంచనా వేస్తున్నారు.

బాలాయపల్లి: తుఫాన్ ప్రభావంతో ఐదు రోజులుగా కురిసన వర్షాలకు బాలాయపల్లి, మన్నూరు, ఎస్సీ, బీసీ కాలనీల్లోని ఇళ్లల్లో నీరు చేరడంతో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పునరావస కేంద్రాలను ఏర్పాటు చేశారు. గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పునరావస కేంద్రాలను సందర్శించి స్థానికులతో మాట్లాడారు. తమకు ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు కావాలని ప్రజలు కోరారు. వర్షాలు తగ్గాక అర్హులను గుర్తించి స్థలాలు, ఇళ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పునరావస కేంద్రాల్లో ఉన్న వారికి అన్ని వసలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో నారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి సత్యనారాయణ, రాయి మస్తాన్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా: పాశిం



చవటపాళెం పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు అండగా ఉంటామని, వారికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం చవటపాళెం గిరిజనకాలనీలో వరదనీరు చేరడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించి పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు వస్తే చవటపాళెం ముంపునకు గురవుతుందన్నారు. ఎటువంటి నష్టాలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కాలువలను యుద్ధప్రాదిపాతికన శుభ్రం చేయించి వర్షపునీరు సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నామన్నారు. చవటపాళెం, పురిటిపాళెం, నెల్లటూరు, తిప్పవరప్పాడు, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి వసతులు, భోజన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తినా తమ దృష్టికి తీసుకువస్తే వారికి సాయం చేసేలా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దారు ప్రసాద్, నాయకులు శీలం కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, పిట్టి నాగరాజు, పెంచలయ్య, అబ్దుల్‌రహీం, సురేంద్ర, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, చంద్రమౌళి, ఇశ్రాయిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎంను కలిసిన ప్రవీణ్

నాయుడుపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ గురువారం రేణిగుంట విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

నాయుడుపేట టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేనకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈవో మునిరత్నం తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభయ్యే ఈ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొంటారని ఎంఈవో తెలిపారు.

నాసిరకంగా సర్వీసు రోడ్లు

- పొలాల్లోకి జారిపోతున్న మట్టి
- వరి నాట్లు వేయడానికి రైతుల అవస్థలు



చిల్లకూరు - వడ్డిపాళెం మధ్య పొలాల్లోకి జారిన సర్వీసు రోడ్డు మట్టి

పెళ్లకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట 71వ జాతీయ రహదారి సర్వీసు రోడ్ల నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జాతీయ రహదారి నిర్మాణం దాదాపు పూర్తి అయినప్పటికీ ఇరువైపులా సర్వీసు రోడ్లు మాత్రం అసంపూర్తిగా ఉన్నాయి. రహదారిపై పడిన వర్షపునీరు సాఫీగా సాగేలా ఇరువైపులా నిర్మించాల్సిన కాలువల నిర్మాణం ముందుకు సాగడం లేదు. మండల పరిధిలో పలు చోట్ల నిర్మాణం పూర్తికాక పోవడంతో రైతులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. సర్వీసు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలతో పాటు మట్టి వర్షాలకు జారిపోయి పొలాల్లోకి చేరుతోంది. దీంతో పంటలు సాగు చేయడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా చిల్లకూరు నుంచి వడ్డిపాళెం వెళ్లే సర్వీస్ రోడ్డు అధ్వానంగా మారింది. సర్వీసు రోడ్డు మట్టి పంట పొలాల్లోకి జారిపోతుండడంతో కనీసం వరి నాట్లు వేసుకోవడానికి రైతులు ఇక్కట్లు పడుతున్నారు. అక్కగారిపేట, టెంకాయతోపు, తాళ్వాయిపాడు తదితర గ్రామాల్లోనూ ఇలాంటి పరిస్థితే నెలకొంది. అధికారులు స్పందించి సర్వీసు రోడ్లను బాగు చేయించాలని రైతులు కోరుతున్నారు.

బాధితులకు సాయం అందించేలా చర్యలు

గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నివాసగృహాల్లోకి నీరు చేరడంతో ఇబ్బందులు పడుతున్న బాధితులకు ప్రభుత్వం నుంచి సాయం అందించేలా చర్యలు తీసుకుంటామని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. గురువారం చెన్నూరులోని రామలింగయ్య కాలనీ, వైఎస్సార్ కాలనీ, నేపాల్ కాలనీలో వర్షపునీరు నివాస గృహాల్లోకి చేరడంతో ఆమె పరిశీలించారు. నివాస గృహాల్లోకి నీరు చేరడంతో గిరిజనులను స్థానిక ప్రభుత్వ పాఠశాలకు తరలించి భోజన సదుపాయం కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.



గిరిజనకాలనీలో వర్షపునీటిని పరిశీలిస్తున్న మట్టం శ్రావణి